4170



[illegible]

1860- [illegible]

[illegible]

0

0

8

0

0

0

బెజవాడ సరస్వతీ బుక్ డిపోవారి స్వంత ప్రచురణములు

వసంతకుసుమాకరము

మధుమేహము, అతిమూత్రము, రాచకురుపులు, శుక్రక్షయము, శుక్రనష్టము, బలహీనత, చిరకాలపు తెల్లకుసుమ, సుఖవ్యాధులు జీర్ణించుటచే కలుగు సకలమూత్రనాళవ్యాధులకు ప్రసిద్ధికెక్కిన రాజౌషధము. తులము రు 20—0—0.

సిద్ధమకరధ్వజము

ఇందు బంగారు కలదు. ఫ్రెంచీ యిచ్చెదము.

జగత్ప్రసిద్ధమగు రసౌషధము. రక్తక్షీణము, హృద్రోగము, నపుంసకత్వము, క్షయ, శ్వాసకాసలు, నరముల బలహీనత, కుసుమ రోగములు, మొదలగువానికి దివ్యౌషధము.

తులము రు 24—0—0. 60 మాత్రలు రు 10—0—0

ఏకోత్తరవృద్ధి మహాలక్ష్మీ విలాసరసము

చ్యవనప్రాశము

క్షయరోగులకు అమృతోపమానములగు దివ్యౌషధములు

చిరకాలము క్షయవ్యాధిచే పీడింపబడుచు వ్యాధిగ్రస్తులుగా నుండువారలకు నూతనయౌవనమును ఆరోగ్యమును కలిగించును. క్షయ శ్వాసకాసలు ఉబ్బసము కఫముతో కలసి రక్తము పడుట, రక్తహీనత, శరీరకృశత్వము, హృదయదౌర్బల్యము దీర్ఘకాలమునుండి బాధించు మొండిదగ్గులు మొదలగునవి జయించును. బలము, కాంతి శక్తియును వృద్ధిచేయును.

రెండు ఔషధములు కలిపి సేవించవలెను.

నెలకు రు 13—12—0.

స్వర్ణక్రవ్యాదరసము

చిరకాలాజీర్ణములకు మంచిది. కడుపుబ్బరము, శూల గుల్మము, యకృత్ ప్లీహ వృద్ధులు మొదలగునవి జయించును. బలవర్ధకము తులం రు 4—0—0.

చిరునామా:—వేంకటేశ్వర ఆయుర్వేదనిలయము,
హెడ్డాఫీసు:—చింతలూరు, ఆలమూరుపోస్టు, తూర్పుగోదావరిజిల్లా

బ్రాంచీలు:—1. కాకినాడ, 2. రాజమండ్రి, 3. పెద్దాపురం, 4. అనకాపల్లి, 5. విశాఖపట్టణం, 6. ఏలూరు, 7. అమలాపురం, 8. తుని, 9. రామచంద్రపురం.

ఏలూరు బ్రాంచిలో చికిత్సకులు

వైద్యవిద్వాన్ కూచిభొట్ల వెంకటేశ్వర్లుగారు.

అభ్రకభస్మము

శ్వాసకాసలు, క్షయ, గుండెజబ్బు, శుక్లదోషములను నివారించును. తులం 4 0 0

సప్తలోహభస్మము

శోఫ, పాండు, కామిల, శూల వీనిని పోగొట్టును. మంచి రక్తము కలిగించును. తులం 4 0 0

క్రమవృద్ధి మహాలక్ష్మీవిలాసరసము

హృదయమునకు బలమునిచ్చు రసాయనము శుక్ర మేహము, దగ్గు, క్షయ, పాండువు, కామిల తగ్గించును. రు 8 0 0

కాంతవల్లభరసం

శోఫ, శ్వాస, కాస, క్షయ, పాండు, కామిల పురాణజ్వరములను, ఉదరములను. రు 4 0 0

త్రైలోక్య చింతామణి

సన్నిపాతజ్వరము, ఊర్ధ్వశ్వాస, అంత్యశ్వాసములకు రోగములను తగ్గించు దివ్యౌషధము. రు 20 0 0

సంగ్రహణీసిందూరము

సూతికావాతములు, ప్రసవానంతర స్త్రీ వ్యాధులు, నరములబలహీనతకు. రు 5 0 0

స్వర్ణచంద్రోదయము

మేహవ్యాధులు, నరముల నిస్సత్తువ, శుక్రమేహము పోగొట్టి పుంస్త్వము నిచ్చును. రు 10 0 0

సిద్ధమకరధ్వజము

ప్రమేహమును పోగొట్టి శుక్రమును వృద్ధిచేసి ఆయువును పెంపొందించు రసాయనౌషధము. రు 40 0 0

మహారాజమృగాంకరసము

క్షయ, శ్వాసకాసలు, అగ్నిమాంద్యమును పోగొట్టును. 6 0 0

రజతచంద్రోదయము

శుక్రనష్టము, నరములవ్యాధులు, బలహీనత జీర్ణజ్వరములకు. రు 4 0 0

మహాలక్ష్మీవిలాసరసము

క్షయ, పాండు, కామిల, హృద్రోగము, ప్రమేహ రోగములు, శుక్రదోషములకు. రు 10 0 0


వ్యాధిహరణరసాయనము

ఉపదంశ (కొరుకువ్యాధి) మూత్రనాళవ్యాధులు నివారించు. 4 0 0

వైద్యవిద్వాన్, చిట్ట నారాయణమూర్తిగారు,

శ్రీకృష్ణాయుర్వేదాశ్రమం

తణుకు, పశ్చిమగోదావరిజిల్లా



సంపుటము ౭ రాజమహేంద్రవరము ౧౫ జనవరి ౧౯౩౬ ౧ వ సంచిక

నిగళబంధనం

సుబ్రహ్మణ్యశాస్త్రి—సంపాదకుడు

మొదటిరంగం

మహామంత్రి తిమ్మరుసయ్యంగారి యిల్లు. లోపలి వసారాలో, తిమ్మరుసు, కుర్చీమీద కూచుని వుంటాడు. అతని భార్య, లక్ష్మమ్మ, కొంచెం పక్కగా నుంచుని వుంటుంది.

తిమ్మరుసు—ఇంకేం లాభం లక్ష్మీ? అంతా అయిపోయింది. అదొక స్వప్నం. అదొక కట్టుకథ అనుకో.

లక్ష్మమ్మ—మీకేం, చెబుతారు. మనస్సులో నాటుకోడమే వస్తే ఆడది యిక మరిచిపోలేదు. కృష్ణు డెదురుపడితే మీ కెలా వుండేదో కాని ప్రాజ్ఞత వచ్చిన కొడుకుని చూస్తే యెలా వుంటుందో అలా వుండేది నాకు. అతను, మొదటికీ—దగ్గిరికి వచ్చి "అమ్మగారూ" అనేటప్పటికి నాకు వొళ్లు గరిపొడిచేసేది. "ఇతగాణ్ణి నా కడుపున యెందుకు పుట్టించాడు కాదూ?" అని ఈశ్వరుడిమీద నాకు కోపంగా వుండేది.

తిమ్మరుసు—సందేహమా? నాకు గూడా కుడిభుజం పడిపోయింది.

లక్ష్మమ్మ—మీచేతిని మీరే నరుక్కున్నారు. తెలుసునా?

తిమ్మరుసు—కొంతవర కలాగే. ఏం చెయ్యగలనూ? రాజాజ్ఞ అలా వుంది. ఈశ్వరాజ్ఞ నేనా జవదాట వచ్చు గాని రాజాజ్ఞ నతిక్రమించడమే? రాజసేవ నిజంగా పాములతో చెలగాటమూ, కత్తులమీద సామూనూ. ఏమాత్రం హెచ్చూ, తక్కువా వచ్చినా బుర్రె లెగిరిపోతాయి.

లక్ష్మమ్మ—లోక్యాని కిదో కవచం దొరికింది. అయినా, మహారాజు కృష్ణుణ్ణి కడతేర్చ మనడంలో— (అర్థోక్తి)

తిమ్మరుసు—కడతేర్చ మని కాదు రాజాజ్ఞ. కళ్ళు పీకించ మనీ.

లక్ష్మమ్మ—కృష్ణుడు జీవచ్ఛవం అయిపోవా లనీ. కదుటండీ?......అయితే: రాజాజ్ఞకంటే యెక్కువ పనే చేశారు మీరు. అవునా?

తిమ్మరుసు—అది కృష్ణుని కోరిక.

లక్ష్మమ్మ—పోనీ, ఆవివరా లేనా చెబుతారా?

తిమ్మరుసు—చెప్పడాని కేం వుందీ? రాజాజ్ఞ అనేటప్పటికి గుడ్లు పీకేశాడు తలారి. తరవాత, ఆ బాధ సహించలేకా, యిక బతికివుంటే మాత్రం లాభం యేమిటనీ, బతికివున్నంతకాలమూ తల్లి నేడ్పించడం మంచిది కాదనీ (అర్థోక్తి)

లక్ష్మమ్మ—ఇది సంతోషపెట్టడం కాబోలు.

తిమ్మరుసు—ఒక విధంగా అలాగే చెప్పవచ్చు. కుంటి అయినా, గుడ్డి అయినా కొడుకు—అందులోనూ యేకపుత్రుడు బతికివుండడం తల్లికి సంబరమే; కాని యిది సామాన్యసంసారుల సంగతి.

లక్ష్మమ్మ—నాగమ్మగారి బతుకు అంతకంటే అధ్వాన్నం చేశారు మీరు.

తిమ్మరుసు—ఎంతచెట్టుకి అంతగాలి కదూ? నేల మీద వున్నవాడు పడితే దెబ్బ తగలదు, స్థితీ మారదూ. కొండమీద వున్నవాడు పడ్డాడంటే మాత్రం తుక్కు తుక్కయిపోతాడు.

లక్ష్మమ్మ—మనకి ధర్మసూత్రాలకు లోటేమిటి లెండి. తరవాత యేం జరిగిందో చెప్పండి.

తిమ్మరుసు—విని అడ్డుతగలకు. కాని నువ్వు వినడం మాత్రం మంచిది కాదు.

లక్ష్మమ్మ—ఏంచేతో?

తిమ్మరుసు—నీగుండె బేజా రయిపోతుంది.

లక్ష్మమ్మ—మీగుండె రాయిచేసుకున్నారు. నా గుండె వజ్రమే అయిపోయింది. ఫరవా లేదు చెప్పండి.

తిమ్మరుసు—అవునవును. "స్త్రీజా దపి కఠోరాణి" కదూ? మరి విను. బతికి వున్నంతకాలమూ తల్లి నేడ్పించడం మంచిది కాదనీ "అది రాజాజ్ఞ అయితే యిది నాకోరిక. తల కొట్టించివెయ్యండి" అన్నాడు కృష్ణుడు.

లక్ష్మమ్మ—ఆపళంగా, ఆపనిమాత్రం, మీచేత్తోటే చేశారు. కాదు టండీ?

తిమ్మరుసు—నీకు తెలవని దేం వుందీ?

లక్ష్మమ్మ—నిజం చెప్పండి. స్వయంగా—(తిమ్మరుసు కుడిచెయ్యి చూపిస్తూ) ఈవుక్కుచేత్తో—(అర్థోక్తి)

తిమ్మరుసు—"కర్తా, కారయితా—" కదూ? స్వయంగానే అని చెప్పవచ్చు.

లక్ష్మమ్మ—గుండెలు కొట్టుకుంటున్నాయి. శరీరం జలదరిస్తోంది......అయితే: రాజాజ్ఞ నిర్వహించడానికి వెళ్లడానికి ముందు మీ రోమాటు యింటికి రావలసింది.

తిమ్మరుసు—ఎందుకూ?

లక్ష్మమ్మ—కృష్ణుడు నాగమ్మగారి కొడుకు కాదు, నాకొడుకు.

తిమ్మరుసు—అయితే?

లక్ష్మమ్మ—కర్త్తైడయితే ముందు నన్ను నరికివేసి, కృష్ణుణ్ణి తరవాత కడతేరిస్తే మీ కింకా కీర్తి కదూ?

తిమ్మరుసు—(కిందికి చూస్తూ వూరుకుంటాడు)

లక్ష్మమ్మ—నిర్దోషినీ, అమాయికుణ్ణీ సంహారించడంలో మీరు చాలా రాజభక్తి కనపరిచారండీ" (అతి కష్టంమీద దుఃఖం సమాళించుకుంటుంది)

తిమ్మరుసు—లక్ష్మీ!

లక్ష్మమ్మ—(పలకదు.)

తిమ్మరుసు—లక్ష్మీ!

లక్ష్మమ్మ—ఇంకా వుందా యేమిటి చెప్పవలసింది?

తిమ్మరుసు—ఒక్క అక్షర మేనా లేదు; కాని, చూడూ. ఆవేశం తెచ్చుకోకు. శివుడి ఆజ్ఞ లేనిదే చీమ అయినా కుట్టదు.

లక్ష్మమ్మ—(గద్గదికతో) ఒక్కొక్కప్పుడు "దేవుడున్నాడా" అనిపిస్తూ వుంటుంది......కాకపోయినా యిది యీశ్వరలీల అని చెప్పుకుని వూరుకోక యిప్పుడేమిటి చెయ్యడం?......కృష్ణు డుంటే యేమీ లోటుండదు. ఇప్పుడతను లేడు. నాగమ్మగారి కింకేమీ లేదు. అంతా శూన్యం. అంతా అంధకారం. విజయనగరంలో అలాంటి మనిషి లేడు. దేవుడి కళ్లతని మీదే పడ్డాయి.

తిమ్మరుసు—కృష్ణుడు సర్వలక్షణసంపన్నుడే కాకపోతే అలాంటి రాజాజ్ఞ పుట్టివుండకే పోవును.

లక్ష్మమ్మ—పుట్టినా నాకు దుఃఖమే లేకపోవును......(నిట్టూర్పు విడిచి) విడుస్తూ విడుస్తూ వున్న తామరమొగ్గని చిదిమేశా రండీ మీరు.

తిమ్మరుసు—చెప్పాను కాదూ? మనుష్యు డేం చెయ్యగలడూ? అయినా, కృష్ణు డీక్షుద్రమానవలోకంలో వుండతగ్గవాడు కాదు.

లక్ష్మమ్మ—అలాంటి వాళ్లుంటే మానవలోకానికి క్షుద్రత్వమే లేకుండా పోతుంది......కానివ్వండి......

అధర్మం జయించింది......అయితే, యిదే స్థిర మయి పోతుందా ?

తిమ్మరుసు—అలా అయితే, అసలు, స్థిరమైన పదార్థం యేం వుంది లక్ష్మీ ?

లక్ష్మమ్మ—చివరికి వేదాంతం......అవును. కృతకృత్యులైనవా రన్నేనా శ్రీరంగనీతులు చెబుతారు.

(అప్పు డొక్క దూకున నీలమ్మ లోపలికి వస్తుంది. తిమ్మరుసు వులిక్కిపడి చూస్తాడు. నీలమ్మ కైజారు దూసి తిమ్మరుసును పొడవబోతుంది. లక్ష్మమ్మ చకితురాలై నీలమ్మ చెయ్యి పట్టుకుంటుంది)

తిమ్మరుసు—(ఉరిమినట్లు) నిలు. (సరిగా కూచుని) నువ్వా ? సరే. (వక్షస్థలం చూపించి) పొడు. విడిచిపెట్టు లక్ష్మీ !

నీలమ్మ—(స్తబ్ధఅయి కైజారు జారవిడిచి దుఃఖంతో కూలబడి) పాపాత్ముడా ! నా కృష్ణుణ్ణి చూస్తే నీకు కళ్లు కుట్టాయా ?

లక్ష్మమ్మ—(నీలమ్మ చెయ్యి విడిచిపెట్టి, నీలమ్మ కేసీ, తిమ్మరుసు కేసీ చూస్తూ వుంటుంది)

తిమ్మరుసు—(నీలమ్మ కేసి గంభీరంగా చూస్తాడు)

నీలమ్మ—నా కృష్ణుడు—నా దేవుడు—నారాయుడు సిన్నేం చేశాడూ ? ఎవళ్లని మాత్రం యేమి చేశాడూ ? దేవాలయంలోనుంచే తీసుకుపోయావుట. ఒక్కమాటు మాకంటబడనిస్తే నీపుట్టి మునిగిపోవునా ?......దుర్మార్గుడా ! ఈ పాపం నిన్ను కట్టి కుడపదూ ?

లక్ష్మమ్మ—ఎవ రండీ యీా అమ్మాయి ?

తిమ్మరుసు—పాపారాయడుగారి కూతురు. నాగమ్మగారికి మేనగోడలువరస. తలిమ్మా సంగతి బోధపడిందా ? (నీలమ్మతో) నీలా ! లే. కూచునే వున్నావేం ? కైజారు పుచ్చుకో. నాపని నేను చేశాను. నీపని నువ్వు చేసుకో.

నీలమ్మ—(లేచి, పులుకూపులుకూ చూస్తూ) నిన్ను పొడిచేసి, నీయిల్లాలిని నాలాగ చెయ్యడమే నాపని. క్షణం దాటిపోయింది. సమయాని కీవిడ దగ్గిరే వుండిపోయింది.

తిమ్మరుసు—ఉంటే యేమిా ? ఈ మాటు అడ్డుకోదులే.

లక్ష్మమ్మ—ఎంత పని చేశా రండీ మీారూ ?

నీలమ్మ—(లక్ష్మమ్మని చూసి, తిమ్మరుసు కేసి తీవ్రంగా చూస్తూ) కళ్లు మూసుకుపోయి వున్నావు. మంచీ చెడ్డా యేమేనా తెలిస్తేనా ? బ్రాహ్మణుట. ఛండాలుడు. రాక్షసుడు. (లక్ష్మమ్మ కేసి తిరిగి) నీ సహకారం చెయ్యక తప్పదు. అటు, రాజు చావడంవల్లా, యిటు అడ్డు చెప్పే వాడు లేకపోవడంవల్లా నీ మొగుడికి స్వాతంత్ర్యం వచ్చిందని పొంగిపోతున్నావు కాదూ నువ్వు ?......ఎంత సేపూ యీా పొంగు ?.........నేనూ ఆడదాన్నే. ఆడదాని హృదయస్పందనం యేలా వుంటుందో ఆడదానికి తెలవాలి కాని మొగాడిను కేం తెలుస్తుంది ?...... నీ కళ్ళకి గూడా బొట్టు కలిగించడం యెందుకూ ? (తిమ్మరుసు కేసి తిరిగి) బ్రాహ్మణాధమా ! జాగ్రత్త. (కైజారు పుచ్చుకొని, చటుక్కున లేచి, వెళ్లిపోతుంది)

తెరలో

నిలు. ఎక్కడికి వెడతావు ?

తిమ్మరుసు—తమ్ముడూ ! ఏమీా అనకు. వెళ్లిపోనియ్యి.

లక్ష్మమ్మ—ఇవన్నా యేమి టండీ ?

తిమ్మరుసు—తరవాత చెబుతాను. (లేచి నుంచుని) అక్కడ, నాగమ్మగారి ఆత్మబంధువులు వస్తూ వుంటారు. దాసీలు కూడా కత్తులు పుచ్చుకుంటారు. కాంపాడానికి వీలులేదు. (పక్కకి చూస్తూ) గోవిందా !

తెరలో

వస్తున్నాను.

లక్ష్మమ్మ—ఏమిటి తరవాయి ?

తిమ్మరుసు—చూస్తూ వింటూ వుండు.

గోవిందరాజు—(ప్రవేశించి) ఎందు కన్నయ్యా ?

తిమ్మరుసు—కత్తి తీసుకురా.

గోవిందరాజు—బాకు చాలా ?

తిమ్మరుసు—చంద్రహాసమే తీసుకురా.

గోవిందరాజు—సరే. (వెళ్లిపోతాడు)

లక్ష్మమ్మ—ఇప్పు డేనా మీరు శాంతికోసం చూడ రన్నమాట.

తిమ్మరుసు—శాంతా ?......ఇక నాకలే శాంతి. నిప్పులాంటి శాంతి యేమిటి ? అగ్నిహోత్రం పూరంతా పాకిపోయింది ఇప్పుడే. ఉరికిలు వేస్తూవుంటుంది. జగన్నాథరథం కదిలింది. ఇక నిలవదు. లయం కావాలి. జయం కావాలి. రక్తం ప్రవహించాలి. ఇక పాలోపాలి అయిపోయింది. ఆడవాళ్లూ మొగవాళ్లూ కూడా కలసి టమే. మారణం యెన్నివిధాల జరగడానికవకాశం వుంటుందో అన్ని ప్రయత్నాలూ జరుగుతాయి. లక్ష్మీ! బోధపడిందా ? సుడిగాలి వీస్తుంది. మూలనున్న వాళ్ళు కూడా మూలుగుకు వస్తారు. ఈతుపాను నీవేప్పుకి కూడా మొగ్గిపుంది.

లక్ష్మమ్మ—ఎరుగుదును.

తిమ్మరుసు—ఈకల్లోలం అణిగిపోయేదాకా నాకు తీరిపిప్పుడు. నువ్వెక్కడో, నేనెక్కడో ? తెలిసిందా ?

లక్ష్మమ్మ—కానివ్వండి.

తిమ్మరుసు—జాగ్రత్త. ఎప్పటి కేమిటో;

లక్ష్మమ్మ—గోటితో పోయీదాన్ని గొడ్డలికి తెచ్చా రుమీరు. స్త్రీల చాతుర్యం కూడా చూస్తారు పురుషులిప్పుడు.

గోవిందరాజు—(కత్తి తెచ్చి తిమ్మరుసు చేతి కందిస్తాడు)

తిమ్మరుసు—(కత్తి పుచ్చుకుని వొరలోనుంచికొంచెం తీసి చూచి) మొన్ననే చికిలీ చేశాడు కమ్మరి. వెంటనే పని—(అర్థోక్తి)

లక్ష్మమ్మ—(ఆకత్తి పుచ్చుకుని) ఇంకోటి చూసుకోండి మీరు.

గోవిందరాజు—(ఉలిక్కిపడతాడు)

తిమ్మరుసు—(గంభీరంగా నిలిచి) ఏమిటీ ?

లక్ష్మమ్మ—తరవాత మాట్లాడుకుందాం.

తిమ్మరుసు—అంటే ?

లక్ష్మమ్మ—అక్కడ మీరూ యిక్కడ నేనూనూ.

తిమ్మరుసు—ఏమి టదీ ?

లక్ష్మమ్మ—అక్కడ మీా శేం చేస్తే, యిక్కడ నే నదీ. ముందు ఆడదాన్ని, తరవాత రెక్కలు లేని దాన్ని చేసి, నాగమ్మనాటికి, చివరికి, సర్వనాశం చేస్తారా మీరు ? నేను చూస్తాను. దిక్కులేనివాళ్లకి దేవుడే దిక్కు. గర్వించకండి. జగన్నాథరథం కదిలిం దన్నారు మీరు. నిజమే. నాలుగు తలుపులూ బిగించి పట్టి బంధిద్దా మంటే పిల్లి, గుడ్లు పీకేస్తుం దని యెరుగుదురా మీరు ? సముద్రం చల్లని దైనా అందులో బడబానలం వుందనీ, రాక రాక అది పైకి వస్తే యిక సృష్టి సర్గా లుండ వనీ తెలుసునా మీకు ?......వెళ్లండి. (కత్తి మొన నేలమీద ఆనించి, ప్రత్యాలీఢపాదంగా నిలిచి, శిరసు వంచుకుని) నాకు సెల విప్పండి.

తిమ్మరుసు—(భార్య శిరస్సుమీద చెయ్యి వుంచి) లే. నీప్రయత్నం కొనసాగుగాక.

లక్ష్మమ్మ—(లేచి) సెలవు. (వెళ్లిపోతుంది.)

గోవిందరాజు—జయం కలగా లని దీవించా వేమిటన్నయ్యా ?

తిమ్మరుసు—ఏం ?

గోవిందరాజు—నీకు నువ్వే అపజయం—(అర్థోక్తి)

తిమ్మరుసు—అవును. కొడుకు చేతిలో తండ్రీ, భార్య చేతిలో భర్తా వోడిపోడం కంటె అందం యేమి వుందోయ్ ? సంగతి కనిపెట్టావా ? సంక్రమించిన అధికారం అన్యాక్రాంతం కాకుండా వుండడానికి ఆవిడ ప్రయత్నిస్తే, అధికారం సంపాదించుకోడాని కీవిడ ప్రయత్నిస్తారు. అక్కడ భర్త మంత్రీ, యిక్కడ భార్య మంత్రిణీ, ఎంత చక్కని సన్నివేశమో చూశావా ? ప్రపంచకంలో వొక్క నాకు తప్ప యిలాంటి యోగ్యత మరెవరికీ కలగలేదు. ఇక కలగదు కూడానూ.

గోవిందరాజు—చాలా తమాషాగా వుంది.

తిమ్మరుసు—ఇంకా సందేహమా ?

గోవిందరాజు—కాని వదిన వొంటరిగా వెళుతోంది. నీలమ్మ యిప్పుడే అల్లరి చేసి వెళ్ళింది. దారిలో కనబడితే—(అర్థోక్తి)

తిమ్మరుసు—కసబడడమే వస్తే వెంటనే కత్తు కలిసిపోతుంది. ఏమీ భయపడనక్కరలేదు.

తెరలో

"సూరప్పా"

"రథం వచ్చి సిద్ధంగా వుంది అమ్మగారూ"

"సరే"

తిమ్మరుసు—అప్పన్నని వొకమాటు తీసుకురా.

గోవిందరాజు—సరే. (వెళ్లిపోతాడు)

తిమ్మరుసు—వుద్ధూరాలు పుట్టాయంటే ఆశ్చర్యమా? మహారాజు, చస్తూ చస్తూ సుఖంలో వున్న ప్రాణాలను దుఃఖంలో వేసి పోయారు. ఎరగనివాళ్లకి రాజ్యాశ పుట్టించారు. లక్ష్మీ మంత్రాంగంలో తిమ్మరాజు హత్యకోసం ప్రయత్నాలు జరుగుతాయి. నీలమ్మ, నామీది కసి అలా తిప్పుతుంది. దీని కంతటికీ యెదటి పచ్చ సహించలేని ఓబమ్మగారే కారణం. కృష్ణరాయడు లేకపోవాలంటే, యిప్పుడావిడకు మనము డేనా తక్కోయోగం లేనట్టుంది............వీరభోజ్యమైన రాజ్యం కోమటియుక్తులకు నిలుస్తుందా?

గోవిందరాజు—(నాదిండ్ల అప్పన్నతో వచ్చి) అప్పన్న వచ్చాడు.

తిమ్మరుసు—వచ్చాడా? అప్పన్నా! సంగతంతా గ్రహించావా?

అప్పన్న—పూర్తిగా గ్రహించాను. తుపాను చెలరేగే టట్టుంది; కాని యిప్పటిమట్టుకి పట్నం అంతా నిమ్మకు నీరుపోసిన ట్టుంది.

తిమ్మరుసు—అంటే గుసగుసల్లో వుం దన్నమాట వ్యవహారం......సర్వసైన్యాధిపత్యం నీదీ. వెళ్లిపో. జాగ్రత్త సుమా!

అప్పన్న—మీ కేమీ బెంగ అక్కరలేదు. అంతా నిశ్చలంగా వుంచుతాను.

తిమ్మరుసు—సరే. వెళ్ళు.

అప్పన్న—మంచిది. (వెళ్లిపోతాడు.)

తిమ్మరుసు—గోవిందా!

గోవిందరాజు—ఎందు కన్నయ్యా?

తిమ్మరుసు—విజయనగరంలో చెలరేగుతూ వున్న యీ అంతఃకలహాలు కారణంగా సామంతులలోనూ, సరదారులలోనూ స్వేచ్ఛావాంఛ పుట్టవచ్చు. శత్రువులు భేరీలు మోగించవచ్చు. జాగ్రత్త. పట్నం నీచేతిలో వుంచుతున్నాను.

గోవిందరాజు—సంతోషం. ఏమీ అపాయం రానివ్వను.

తిమ్మరాజు—మరి వెళ్లిపో.

గోవిందరాజు—ఇదిగో, వెళ్లిపోయాను. (వెళ్లిపోతాడు)

తిమ్మరుసు—ఇది సుఖాంతం అవుతుందా, దుఃఖాంతం అవుతుందా? చూస్తూ వుండగా వ్యవహారం యెంత ముదిరిపోయింది?.........మునిగిపోయిం దేమీ లేదు. కంగా రక్కర్లేదు. (చేతులు చూసుకొని) కత్తిమాట మరిచేపోయాను......అక్కడికే వెళ్ళి పుచ్చుకుంటాను. కాకపోయినా, నరాల్లో పటుత్వం వుంటే యెదటివాళ్ళ ఆయుధాలు మనచేతికే వస్తాయి.

(వెళ్ళిపోతాడు)

రెండో రంగం

(నాగమ్మనగరు. ఒక వసారాలో నాగమ్మ పీట మీద కూచుని వుంటుంది. కైజారు ముందు పెట్టుకుని ఆమె కొక పక్కగా నీలమ్మ కూచుని వుంటుంది. అపనిమీదా, యీపనిమీదా, మధ్య మధ్య, దాసీలు వస్తూ పోతూ వుంటారు.)

నాగమ్మ—నేను పెద్దదాన్ని. నువ్వు చిన్నపిల్లవు. పైగా యిద్దరికీ దుఃఖం తలమునకలుగా వుంది. మనం పగ తీర్చుకోగలమా?

నీలమ్మ—ఎందుకు తీర్చుకోలే మత్తయ్యా? యథాశక్తి. ఎవరు చేసినా అంతే. పుట్టింది గాచకాలం. పైగా, అపకారమూ, పరాభవమూ జరిగాయి. శరీరం దహించుకుపోతూవుంది. ఇక యీజన్మకి సుఖ మెలాగా లేదు. బతుకూ సందేహమే. వీలయినంత వర కేనా పగ తీర్చుకోకపోతే యిక చేసే దేం వుంది?

నాగమ్మ—నాకూ నీకూ భేదం వుంది.

నీలమ్మ—పాతా కొత్తానూ. అంతకంటే యేమీ లేదు. తిమ్మరుసయ్య చేసిన గాయంమీద మీరు కారం చల్లవద్దు.

నాగమ్మ—కొంచెం వెనకా ముందూ చూడవూ తల్లీ?

నీలమ్మ—వెనుక నుయ్యీ, ముందు గొయ్యీనీ. అడియాసలు వద్దు అత్తయ్యా!

నాగమ్మ—నీది వ్యగ్రోత్సాహం.

నీలమ్మ—కసకసే పగ తీర్చుకోవా లని హైరాన యి పోతున్నాను. తిమ్మరుసయ్యని విడిచిపెట్టినా యిబ్బంది లేదు; కాని ఆనిర్భాగ్యుణ్ణి పొడిచివెయ్యాలి.

నాగమ్మ—ఏనిర్భాగ్యుణ్ణీ?

నీలమ్మ—వాణ్ణే...... తెలునలేదూ ? ఎవడి అధి కారం నిలవ దని చచ్చిసరాజు ఇంత పని చేయించాడో —(అర్ధోక్తి)

నాగమ్మ—తిమ్మరాజునా?

నీలమ్మ—పేరుచ్చరిస్తే పాపం చుట్టుకుంటుంది. వాణ్ణే.

నాగమ్మ—(ఉద్రేకంతో) ఏమన్నావు కోడలా?

నీలమ్మ—(ఆవేశంతో) ఎవడిమూలంగా నాకు బావయ్యగారు లేకపోయారో ఆయేల్నాటిశనిగాణ్ణి హతంచేసి,మీ పెద్దసవతికడుపున చిచ్చుపెట్టి—(అర్ధోక్తి)

నాగమ్మ—అదీ మాట! నీలం! ఎంత చల్లని మాట చెప్పావూ? ఒక్కమా రిలా రా తల్లీ!

(నాగమ్మ చేతులు చాపుతుంది. నీలమ్మ దగ్గిరికి వెళ్లి కూచుంటుంది. నాగమ్మ నీలమ్మని గట్టిగా కౌగిలించుకుని మూర్ధాఘ్రాణం చేస్తుంది.)

నాగమ్మ—నాకూనా! ఇక నీకు అడ్డు చెప్పను. ఎలా చేస్తావో ఆకాస్త పనీ చేసేస్తివా తరువాత నువ్వూ నేనూకూడా బావయ్యదగ్గిరికి సంతోషంగా వెళ్లిపోవ చ్చును.

నీలమ్మ—ఇంతవరకూ నాకు కసే గాని మీ ప్రోత్సాహం లేదు.ఇక చూడండి, ఈరాత్రి కడిచాటప్పటికి యేడుపులూ పెడబొబ్బలూనూ.

(అప్పు డొక దాసి లోపలికి వస్తుంది)

దాసి—లక్ష్మమ్మగారు వస్తున్నారుట అమ్మగారూ!

నీలమ్మ—తిమ్మరుసయ్య పెళ్లామా? (లేచి వెళ్లి పోతుంది)

నాగమ్మ—పరామర్శకి కాబోలు. మొగుడు మింగె య్యడమూ, పెళ్లాం వగచడమూనూ.

నీలమ్మ—(పరుగుపరుగున వచ్చి కైజారు దూసి చేతపుచ్చుకుని) లక్ష్మమ్మ ఖడ్గం పట్టుకుని వస్తోంది. నేను చెయ్యబోయిన పనికి బదులు చేస్తుంది కాబోలు. వచ్చిం దంటే పొడిచేస్తాను. ఏ మత్తయ్యా?

నాగమ్మ—తొందరపడకు తల్లీ !

నీలమ్మ—ఇక నేను ఆగలే నత్తయ్యా !

నాగమ్మ—వచ్చిన పనేమిటో తెలుసుకోకుండా దుడుంగు మంటే గేలం వెయ్యవచ్చునా అమ్మా ?

నీలమ్మ—(మొగం వంచుకుని వూరుకుంటుంది)

దాసి—ఏమి సెలవు అమ్మగారూ ?

నాగమ్మ—తీసుకురా.

దాసి—చిత్తం అమ్మా! (వెళ్లిపోతుంది)

నాగమ్మ—వెంట యెవ రేనా వున్నారా తల్లీ ?

నీలమ్మ—ఆవిడ తమ్ముడు, మాచిరాజు వియ్యన్న గారు కూడా వస్తున్నారు.

నాగమ్మ—(ఆలోచిస్తూ) ఎందు కయి వుంటుందీ ?

(అప్పుడు దాసివెంట లక్ష్మమ్మా, మాచిరాజు వియ్యన్నా వస్తారు. దాసి పక్కకి తప్పుకుం టుంది. నాగమ్మ, చూచి, మొగం వంచుకుం టుంది.)

నీలమ్మ—(లేచి) అక్కడే నుంచో. అడుగు ముం దుకు వేశా వంటే బాగా జరుగదు.

లక్ష్మమ్మ—బాగా జరగ దంటే ?

నీలమ్మ—పొడిచేస్తాను.

లక్ష్మమ్మ—నీయిష్టం.నాకేమీ అభ్యంతరం లేదు. నీకంత వుబలాటంగా వున్నప్పుడు నే నెందుకు కాదనాలీ? అయితే: ఇక్కణ్ణుంచి అడుగు ముందుకి వేస్తే కదా పొడవడం ? పని వచ్చినప్పుడు నేను చెప్పే అడుగువేస్తా నులే. నాగమ్మగారూ ! తమకు గొప్ప ఆపద వచ్చింది.

అయినా నేనిప్పుడు పరామర్శ చెయ్యడం కోసం రాలేదు.

నాగమ్మ—భర్తగారు చేసిన దానికి తరవాయి తీర్చడానికి వచ్చారా? అది రాజుగారి ఆజ్ఞ అయితే యిది రాణీగారి ఆజ్ఞ గాబోలు.

లక్ష్మమ్మ—రాజు చచ్చిపోయాడు. ఇక రాణీ అంటే యెవరూ?

నాగమ్మ—(చకితే అయి చూస్తూ వూరుకుంటుంది)

లక్ష్మమ్మ—విజయనగరిసింహాసనం యిప్పుడు ఖాళీగా వుంది. రాజే లేనప్పుడు రాణీఅంటే యేమిటీ?

నాగమ్మ—తమ మాటలు విచిత్రంగా వున్నాయి. ఏదో క్రొత్తధోరణి స్ఫురిస్తోంది. కాని మొదలూ తుదా అవగాహన కావడం లేదు. తమరు, నేననుకున్న పనికోసం వచ్చివుండకపోతే, తమ వుద్దేశం యేమిటో స్పష్టంగా సెల విప్పించండి.

లక్ష్మమ్మ—ముందు, తమరు, నాకొకటి దయచేస్తే తరవాత నేసంతా సవిస్తరంగా మనవి చేసుకుంటాను.

నాగమ్మ—అదేమిటీ?

లక్ష్మమ్మ—తమరు నాకు మంత్రిపదవి దయచెయ్యాలి.

నీలమ్మ—(ఉద్రేకంతో) వల్లకాదు. నువ్వు మాక్కరలేదు.

నాగమ్మ—ఒక్క నిమిషం వూరుకోతల్లీ! (లక్ష్మమ్మతో) తమకు మంత్రిపదవి యివ్వడానికి మా కేం వుంది లక్ష్మమ్మగారూ?

లక్ష్మమ్మ—ఉపయోగించుకోవా లనే సంకల్పం వుంటే అన్నీ వున్నాయి. సరసరాయలవారి దేవేరికి లేని దేమిటీ?

నాగమ్మ—దానివల్ల నాకేం వచ్చిందీ?

లక్ష్మమ్మ—ఆశ తెంపుకుని కూచుంటే నే నేం చెప్పగల నమ్మా?

నాగమ్మ—తమరు నాకు బోధపడేటట్టు సెల విప్పించాలి.

లక్ష్మమ్మ—ఫీడి తరవాత రాజు కావలసినవాడు ఫలానా అని యిద్దరి మొగాల మీాదా రాసివుంటుందా అమ్మా? రాజయోగం వున్నవాడు ఒకరాజుకి ఉత్తరాధికారి కావచ్చు. ఒక రాజ్యం అయినా కల్పించుకోవచ్చు. ఒకడి రాజ్యం అయినా ఆక్రమించుకోవచ్చు. రాజుల కొడుకు లెందరో భిక్షాధికారు లయిపోయారు. సామాన్యు లెందరో రాజు లయిపోయారు. తమభర్తగారి చరిత్ర మననం చేసుకుంటే చాలదూ అమ్మా?

నాగమ్మ—తమరు నామనస్సు కెక్కిస్తూ వున్న దమృతమో విషమో తెలవడం లేదు.

నీలమ్మ—విషం విషం. ఈ విడ మాటలు నమ్మకండత్తయ్యా!

నాగమ్మ—కాస్త ఓపిక పట్టవమ్మా తల్లీ! ఏమంటారు లక్ష్మమ్మగారూ తమరూ?

లక్ష్మమ్మ—ఇప్పుడేనా నాకు మంత్రిపదవి యిస్తారా?

నాగమ్మ—బోధపడుతోంది. అదా సంగతి? అయితే ప్రయోజనం వుంటుందా?

లక్ష్మమ్మ—నాకు మంత్రిపదవి దయచేస్తే గాని వొక్క అక్షర మేనా చెప్ప నిక.

నాగమ్మ—భల్లూకపు పట్టు పట్టారే? సరే మరీ. మోసం జరిగినా యిదివరకి జరిగిన విపత్తు కంటే గొప్పది జరగదు. (లేచి, లక్ష్మమ్మని సమీాపించి) ఇదిగో నా భవిష్య దభ్యుదయానికి తమర్ని నామంత్రిగా ఏర్పరుచుకుంటున్నాను. (చేతిలో చెయ్యి వేస్తుంది)

లక్ష్మమ్మ—అంటే?

నాగమ్మ—నాకు పదవి వచ్చాక తమరు మంత్రు లన్నమాట.

లక్ష్మమ్మ—అయితే, నేను సలహాలూ ఆలోచనలూ అప్పణ్ణుంచే చెబుతాను.

నాగమ్మ—అయితే ఏమంటారూ తమరూ?

లక్ష్మమ్మ—ఆపదవి నాకిప్పుడే స్వాధీనం కావాలి.

నాగమ్మ—అయితే సరే. తమరు ఇప్పణ్ణుంచీ నాకు మంత్రిగా వుండండి. ఇదే మాట. (మళ్లీ చేతిలో చెయ్యి వేస్తుంది)

లక్ష్మమ్మ—ఇక వినండి.

నాగమ్మ—సెల విప్పండి.

లక్ష్మమ్మ—రాజ్యాలు మంత్రాధీనాలు. మంత్రు లంటే మంత్రాలకు భౌతికస్వరూపాలు. కనక ప్రభువులు మంత్రుల మాటలు పాలిస్తూ వుండాలి.

నాగమ్మ—సరే.

లక్ష్మమ్మ—అక్కడ భర్త మంత్రీ, ఇక్కడ భార్య మంత్రిణీ. తత్వం గ్రహించగలవాళ్ళ కేమీ వుండదు; గాని సామాన్యదృష్టికి మాత్రం యిందులో తీసినకొద్దీ అర్థా లున్నాయి.

నాగమ్మ—అవును.

లక్ష్మమ్మ—తమకు తీరని అపకారం జరిగింది. అప కారం అంటే అంతటిదీ యింతటిదీ కాదు, కడుపుచిచ్చు. అయితే: ఈ అపకారం యెవరు చేశా రని కాదు ప్రశ్న, ఎవరు చేయించారు ? ఇది తమకు సంభవించడానికి కార ణం వొకరూ, సాధనం వొకరూనూ,

నాగమ్మ—ఊహూ,

లక్ష్మమ్మ—తమ కుమారుణ్ణి చంపినవారు మా వారే; కాని చంపించినవారు తమ సవతి కొడుకు.

నాగమ్మ—అవును. ఏమీ సందేహం లేదు. అం దులో సవతి ప్రోత్సాహం కూడా చాలా వుంది. ఆవిడ నాకొడుక్కి విషప్రయోగం చేయించడానికి మూడుమా ట్లు ప్రయత్నించడం నే నెరగనూ ?

లక్ష్మమ్మ—అవునుగదా ?

నాగమ్మ—ఏగ్రహం వక్రించడంవల్లనో యిప్పుడిలా చేశారు; గాని అప్పుడు తమ భర్తగారే కాదూ నా తండ్రిని రక్షించినవారూ ?

లక్ష్మమ్మ—అంటే తమకి శత్రువు లెవరో సాధించ వలసినవా రెవరో తెలుసు నన్నమాట.

నాగమ్మ—కానివ్వండి.

లక్ష్మమ్మ—కానివ్వ మంటే కాదు. నామాటలు తమరు నమ్మారా లేదా ?......ఒకటి మనవి చేస్తాను ఆలకించండి. ఇప్పుడు నేను తమకి మంత్రిగా వున్నాను. ఒకర్ని నాశనం చేయించడానికి తమరు నిశ్చయించుకుం టారు. అది చెయ్యవలసిం దని నా కాజ్ఞాపిస్తారు. నేనా పనిచెయ్యాలా అక్కర్లేదా ?

నాగమ్మ—ఊఁ.

లక్ష్మమ్మ—ఊఁ అంటే కాదు. స్పష్టంగా సెల విప్పండి.

నాగమ్మ—చెయ్యాలి.

లక్ష్మమ్మ—మావారు చేసిన పని అంతే.

నాగమ్మ—సరే.

లక్ష్మమ్మ—తమమీద మావారి కేమీ ద్వేషం లేదు. తమరుకూడా వారిని ద్వేషించకూడదు.

నీలమ్మ—ఇదా అమ్మా యెత్తూ ? అత్తయ్యా! —(అర్థోక్తి)

నాగమ్మ—ఇంకొక్క క్షణం వూరుకో తల్లీ! సెల విప్పించండి లక్ష్మమ్మగారూ!

లక్ష్మమ్మ—కృష్ణుడు ప్రయోజకుడు కనక తమ అనంతరం తమ కొడుక్కి రాజ్యం దక్కనివ్వ డేమో నని తమ సవతికొడుకు ఇంతపని చేయించారు. కృష్ణుడు లేక పోతే మాత్రం ఆపిల్లాడికి రాజ్యం తక్కకుండా చెయ్య డానికి మన కేమి అడ్డూ ?

నాగమ్మ—బాగా సెలవివ్వండి

లక్ష్మమ్మ—ఏరాజ్యంకోసం వారు మనకృష్ణుణ్ణి లేకుండా చేశారో, ఆరాజ్యంకోసం మనమున్నూ అకుర్ర కుంకని లేకుండా చేద్దాం

నాగమ్మ—చాలా బాగానే వుంది. కాని సాధ్యమా?

లక్ష్మమ్మ—అది సాధ్యపడుతుందా, రాజ్యం మనది. ఓడిపోతామూ ? తమ కిదివరకే సర్వనాశం సంభ వించివుంది.

నాగమ్మ—ఊహూ.

లక్ష్మమ్మ—అదీకాక: మనుష్యులు జయం అను కుంటే అపజయం కావచ్చు. అపజయం అనుకుంటే జయ మున్నూ కావచ్చు. ఇది చిట్టచివరగాని తేలే విషయం కాదు.

నాగమ్మ—అవును

లక్ష్మమ్మ—కనక ముందు మనం ఆపురుగును సలిపివేద్దాం

నాగమ్మ—(చకితయై నీలమ్మకేసి చూస్తుంది)

నీలమ్మ—బాగానే కనబడుతోంది. మనం అనుకున్నదీ యిదే కాదూ?

నాగమ్మ—ఇంకా సెల వివ్వండి లక్ష్మమ్మగారూ!

లక్ష్మమ్మ—ఈపని చేస్తే వారూ మనమూ సమానమౌతాం. ఇక రాజ్యం—

నాగమ్మ—ఆమహారాజు కొడుకు అచ్యుతరాయడుండనే వున్నాడు. ఆవిషయంలో మన కేమీ ఆలోచన లక్కరలేదు.

లక్ష్మమ్మ—అతడుమాత్రం కృష్ణుడికంటేయెక్కువా వోబమ్మగారికి?

నాగమ్మ—అవునుసుమండీ! వంశం అయినా నిలవనిస్తుందో లేదో ఆరాక్షసి.

లక్ష్మమ్మ—కనక సింహాసనం కూడా మన దృష్టిలో వుండవలసిన దే.

నాగమ్మ—అయితే: మనం యింతపని చెయ్యగలమా లక్ష్మమ్మగారూ?

లక్ష్మమ్మ—ఎందుకు చెయ్యలేమూ? పురుషులయినా స్త్రీలయినా జీవనం వొకటే. పగలోనూ, ఆశలోనూ, ఫలంలోనూ, అనుభవంలోనూ స్త్రీ అనీ పురుషుడనీ యేర్పా ట్లేమీలేవు. లోకవృత్తం పరిశీలిస్తే మొగవాడికంటే ఆడది లొచ్చు అని యింకా నిర్ధారణ కాలేదు. "మాకు అడ్డేమిటి?" అని గర్వించిన పురుషుల్ని స్త్రీలు బోల్తా కొట్టించిన సందర్భాలెన్నో వున్నాయి. రుద్రమ్మతల్లిని మరిచారా అమ్మా?

నాగమ్మ—సరే. ఇక ఆవిచక్షణ చెయ్యడం యెందుకూ? ఏటి కడ్డుపడదాం. అయితే డబ్బేమాత్రం కావా లంటారూ?

లక్ష్మమ్మ—ఖర్చుపెడితే కోట్లు చాలవు. లేకపోతే పని అడ్డదు. (పక్కకి చూసి) ఇలారా తమ్ముడూ!

వియ్యన్న—(చేతులు కట్టుకుని వచ్చి నాగమ్మ యెదట వంగి నుంచుని) తమ సెలవు కోసం యెదురు చూస్తున్నాను.

లక్ష్మమ్మ—ఇతను నాకు తమ్ముడు. మా పింతల్లి కొడుకు. పేరు మాచిరాజు వియ్యన్న. బావగారికి తీసిపోడు. తమరు మాతమ్ముణ్ణి పూర్తిగా నమ్మి ఈపనిలో నియోగించుకోవచ్చు.

నాగమ్మ—చిత్తం, అలాగే చేద్దాం.

లక్ష్మమ్మ—తగినంత పని కలిగే దాకా లోపలే వుందాం మనం. ప్రత్యక్షంలో సేనాధిపతి అయినా, మంత్రి అయినా, నౌకరు అయినా సర్వమూ మా తమ్ముడే.

నాగమ్మ—(వియ్యన్నతో) మమ్మల్ని వొడ్డెక్కించాలి తమరు. (చేతులు జోడించుకుని ప్రార్థిస్తుంది)

వియ్యన్న—ఏలినవారి సేవలో నాజీవితం ధారపోస్తాను. తమరు నిశ్చింతగా కూచోవచ్చు.

నాగమ్మ—ఇంకెవరున్నారూ మనకీ?

లక్ష్మమ్మ—మా మరిది గోవిందరాజూ, నాఅల్లుడు అప్పన్నా సమయానికి మన పక్షంలోనే వుంటారు. వారినిబట్టి యింకా అనేకమంది వుంటారు. తమరు దిక్కుమాలిన స్థితిలో లేరు నాగమ్మగారూ!

నాగమ్మ—తమరుండగా నాకు దిక్కు లేకపోవడం యేమిటి లక్ష్మమ్మగారూ

లక్ష్మమ్మ—కనక, యిక్కడి సంగతి చెప్పండి. తమ ఆత్మబంధువులలో—(అర్ధోక్తి)

నాగమ్మ—నీలమ్మని చూస్తూనే వున్నారు తమరు.

నీలమ్మ—ఆపురుగుని నేనే సలిపివేస్తాను.

లక్ష్మమ్మ—ఒక సంగతి, ముందు, తమతో మనవి చేసుకుంటున్నాను. ఒకరి మాటలు విని తమరు నన్ను మానించగూడదు. నేనేమి చెప్పినా వెంటనెంటనే జరిగిపోతూ వుండాలి.

నాగమ్మ—అలాగే జరుగుతాయి. తమయెడల నాకు పూర్తిగా విశ్వాసం కలిగింది. అయితే: మానీలం అలా యెందుకు చేసిందో—(అర్ధోక్తి)

లక్ష్మమ్మ—యెరుగుదును.

నాగమ్మ—నాకోడలిని తమరు క్షమింపకోరుతున్నాను. లక్ష్మమ్మగారి పాదాలు పట్టుకోతల్లీ !

నీలమ్మ—చిత్తం. (వంగి, లక్ష్మమ్మ పాదాలు పట్టుకుని) నాసంగతి యెరుగుదు నన్నారు తమరు. క్షమించి రక్షించండి.

లక్ష్మమ్మ—(ఆమెని ఆదరంతో లేవనెత్తి) మీరేమి చేశారో నేను మరిచిపోయాను. మీరు కూడా మరిచిపొండి. మన మిప్పుడు పగ సాధించాలి. మాకృష్ణుణ్ణి కూడా మరిచిపోవాలి మీరిప్పుడు.

నీలమ్మ—సాధ్యమా ?

లక్ష్మమ్మ—సాధ్యం చేసుకోవాలి. మన పని అయే దాకా మరిచిపోవాలి. ఈలోపున మీరు కనక కృష్ణుణ్ణి తలుచుకున్నా రంటే మీదీక్ష దుఃఖచ్ఛన్న మయిపోతుంది.

నాగమ్మ—అవునమ్మా! లక్ష్మమ్మగారి సెల వయే దాకా నాకడుపుచిచ్చు కూడా నేను మరిచిపోతాను.

నీలమ్మ—చిత్తం

లక్ష్మమ్మ—మేమిప్పటికి యింటికి వెడతాము. మళ్లీ యెప్పు డవసర మయితే అప్పుడు దర్శనం చేస్తాను. ఈ లోపుగా నాకర్లుండనే వున్నారు.

నాగమ్మ—బాగుంది. అవసర మయితే యాభై లక్షలు గుమ్మరిస్తాను.

లక్ష్మమ్మ—ఉండనివ్వండి. ఇప్పు డెందుకు తొమ్మండూ?

వియ్యన్న—వీకలమీదికి వచ్చేదాకా దమ్మిడీ అయినా కదపవద్దు. అవసరమున్నూ లేదు. మనకి సైన్యం లేదను కోవద్దు తమరు. ఖజానామీద కూడా మనకి చెలామణీ వుంది. తమరు ఆజ్ఞలు మాత్రమే దయచేయిస్తూ వుండాలి. చిత్తగిస్తారు కాదూ వియ్యన్న శక్తి సామర్థ్యాలూ ?

లక్ష్మమ్మ—మరి శెలవు.

నాగమ్మ—సెలవు.

వియ్యన్న—శెలవు దయచెయ్యండి.

నీలమ్మ—చిన్నత్తయ్యా! సెలవు.

నాగమ్మ—అయితే,లక్ష్మమ్మ గారూ! నాయన కడ తేరినట్టే ?

లక్ష్మమ్మ—తమ రత్నణ్ణి మరచిపోవాలి. మనస్సు రాయిచేసుకోవాలి.

నాగమ్మ—ఎందుకట్టె నయివున్నాను. అసలు మన స్సంటూ వొకటి వుంటేనా ?

లక్ష్మమ్మ—సెలవు.

నాగమ్మ—సెలవు.

(లక్ష్మమ్మా, వియ్యన్నా వెళ్ళిపోతారు. నాగమ్మా, నీలమ్మా, వారినిద్వారందాకా సాగనంపుతారు.)

నాగమ్మ—ఇదంతా యేమి టంటావు తల్లీ ?

నీలమ్మ—అన లేమి టయినా, చివరి కేమయినా సలహామాత్రం బాగుంది. బావయ్యగారిని కన్నందుకు తమరూ, కొలిచినందుకు నేనూ యింతకంటే చెయ్యవలసిం దేమీ లేదు.

నాగమ్మ—చంపి చచ్చిపోదాం. అంతే కాదూ ?

నీలమ్మ—మన భవిష్య త్తంతా లక్ష్మమ్మగారి చేతిలోవుంది. ఇప్పు డేమీ తేలదు.

నాగమ్మ—మొగుడికి తగ్గ పెళ్లాం ఆవిడ. తమ భార్యే మనపక్షంగా వుండడంవల్ల తిమ్మరుసయ్యంగారు మనమీద అంత ఉగ్రత చూపించకూడదు. ఇది కూడా వొకందుకు మంచిదే.

నీలమ్మ—మా బాబయ్యగారితో కూడా యీసంగతి కొంచం ఆలోచించడం మంచిదండీ అత్తయ్యా!

నాగమ్మ—అవును నాకూనా. కబురుచేద్దాం. ఇంతలోమనం కాస్త ఫలహారం చేదాం రా తల్లీ.

నీలమ్మ—దయచెయ్యండి.

సశేషం

ఆంధ్రునికి ఆంధ్రదేశములో భిక్ష పుట్టడంలేదు

భావరాజు వేంకటకృష్ణారావుగారు బి. ఏ. బి. ఎల్

ఆంధ్రదేశానికి దూరదృష్టిగల నాయకుడు కావలయును. ఇపుడు దేశంలో చాలామంది నాయకు లున్నారు; కాని, ఈనాయకులు దేశానికి భవిష్యత్తునందు భాగ్యోదయ మగుటకు ఏమీ తోడ్పడరు— వీరి దృష్టి నేటి విపరీతపరిస్థితులలో కారుమేఘాలలో మెరిసే మెరపువలె అదృశ్యమైపోవుచున్నది. ఈదేశీయనాయకులకు ఒక్క మహాలోప మున్నది: ఎవరికి వారే తాము అందరికంటె గొప్పవార మని అహంభావము నడినెత్తిమీదికి గుప్పెడు ఎదిగి ఉన్నది. ఈనాయకులు పరస్పరద్వేషములతో, అసూయలతో అల్లాడి, కుళ్లిపోవుచున్నారు. అంతకంటె దేశహితైకపరులై, తమ తమ హృదయాలను పరిశీలించుకుని, ఒకళ్ల ఉద్దేశములను ఒకళ్ళు అర్థము చేసుకుని, తమ అభిప్రాయములను దిద్దుకుని, ప్రతికార్యము దేశక్షేమానికే వినియోగపడేటట్టు ప్రయత్నం చేస్తే చాలా బాగుంటుంది. నలుగురు నాయకులు ఐక్యభావము కుదిరేటట్టు నడుచుకుంటే మేలు. సొంత మేలు కోసకు నేటి శ్రీమంతులు తంటాలుపడి గౌరవం పోగొట్టుకోవడం, వారికి శ్రేయస్కరం కాదు; దేశానికి ఉపయోగం లేదు.

* * * *

ఆంధ్రదేశంలో నాయకుల మని పేరుప్రతిష్ఠలు సంపాదించుకున్న వారివల్ల ఆంధ్రుల కేమి భాగ్యము చేకూరింది? ఆంధ్రోద్యమమును నడిపిస్తా నని ఆశపెట్టి బొబ్బిలిరాజాగారు ముందుకు వచ్చారు. సగం త్రోవలో అటు యిటు గాని మహారణ్యంలో ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణోద్యమమును వదిలిపెట్టి వెళ్లినారు. జమీందారుల సంఘంలో చేరడంచేత పర్లాకిమిడి, కల్లికోట రాజాగార్లకు అగ్రహం వస్తుందనో, లేక తమ సొంతలాభానికి ప్రయోజనకారిగా ఉండదనో, భయపడి ఆంధ్రోద్యమమును జాలి, జంకులు లేక విడిచిపెట్టినారు. వారి నాయకత్వాన్ని అనుసరించిన వెంకటగిరికుమారరాజాగారు ఇంగ్లండునకు వెళ్లినట్టే వెళ్లి అక్కడ మౌనవ్రతం దాల్చి ఊరకున్నారు—మహానుభావుడు, సర్ కూర్మా వెంకటరెడ్డినాయడుగారు అదే దారి త్రొక్కినారు. సొంతలాభం మరువలేకపోయినారు. దేశమును వెనుకకు త్రోసివేసినారు; లభ్యమయిన ఒక మంచి తరుణమును బుద్ధిపూర్వకముగా పోగొట్టుకున్నారు. ఒకమాటు తరుణం పోయిన-తరువాత మరల రాదుకదా? ఆంధ్రదేశముపై అముగ్గురు మహానాయకులకు దయ లేక పోయినది. అయితే వారు మాత్రం ఆంధ్రుల ప్రతిభకు, నైజగుణసంపత్తికి ప్రత్యక్షసాక్ష్యము లైనారు. వీరి చర్య అంతా చూస్తూ వున్న ప్రపంచానికి, ఆంధ్రులలో ఐక్యభావం లేదు, దేశం అంటే అభిమానం లేదు; ఆంధ్రునికి ఆరంభశూరత్వము మెండు, కార్యాచరణమందు చాకచక్యము, పట్టుదల, దీక్ష తక్కువ. పసిబిడ్డలాగున కాస్సేపు ఏడ్చి, మళ్లీ యిట్టే అంతా మరచిపోతాడు, ఈఆంధ్రులను ఇట్టే సులభంగా త్రోవతప్పించి నడిపించవచ్చు. అని తోచింది. ఇటువంటి ఆంధ్రనాయకులను జూచి ఆంధ్రులు సంతాపము నొందుచున్నారు. చూచే పైవాళ్ళు అన్న ఆక్షేపణలకు వళ్ళు గగిలిపోతుంది, కాని నిస్సహాయతవల్ల అభిమానం పెచ్చురేగి వళ్లంతా దగ్ధమైపోయి శూన్యత్వం ప్రాప్తిస్తున్నది.

* * * *

అదివరకు చక్కగా సాగుతున్న ఆంధ్రోద్యమము కాంగ్రెసు వెల్లువరావడంతోనే కుంటిదై పోయింది. ఎదుగుతూఉన్న మొక్కకు విషవాయువు సోకినట్లయింది. తీగెలుసాగి, పూవులుపూచి, ఫలములొసగవలసినపాదు, కుమట్లోకి క్షీణించిపోయింది. ఆంధ్రోద్యమమును సాగిస్తూఉన్న దేశీయనాయకులు, కొండా వెంకటప్పయ్య, డాక్టరు పట్టాభి, ప్రకాశంపంతులు కాశీశ్వరరావుగారు నాగేశ్వరరావుగారు మొదలయిన మహానాయకులంతా, కనుచూపుమేరలో స్వరాజ్యంకనబడుతున్నట్లుభ్రమపడి, దేశాభ్యుదయమునకుపునాదివంటి ఆంధ్రోద్యమాన్ని తటాలునవిసర్జించి కాంగ్రెసుఉద్యమంలోనికిఉరికినారు. ఇతర ప్రాంతాలలో కాంగ్రెసు ఉద్యమం ప్రబలినా, అప్పటికి సాగుతూఉన్న మహోద్యమాలు అణిగిపోలేదు. అచ్చటి నాయకులు చాలా మారదృష్టితో కాంగ్రెసు ఉద్యమంతో పాటు వెనుకటి వాటినిగూడా సమంగా నడిపినారు—వాటితో, కాంగ్రెసుకు ఎక్కడా సంఘర్షణ రానీయలేదు. కాంగ్రెసు వచ్చి రాష్ట్రీయ సమస్యలను త్రుంచివేయ నివ్వలేదు. ఏఉద్యమానికి ఆఉద్యమమును వేర్వేరుగాఉంచి వ్యవహారం చక్కబెట్టుకున్నారు. కాని ఆంధ్రదేశంలో మాత్రం అట్లు గాకపోయింది. కాంగ్రెసు ఉద్యమం ప్రస్తుతంలో పరాజయం పొందడంచేత ఆంధ్రోద్యమానికి కూడా వెన్నెముక విరిగిపోయినట్లయింది. పాకీకేంద్ర కృషిఅంతా బుగ్గయిపోయింది. కాంగ్రెసువల్ల ఆంధ్రదేశానికి ఏమీ ఉపకారం జరగలేదు. జరిగినదంతా అపకారమే—ఆంధ్రరాష్ట్రము ఎప్పుడైనా వస్తుంది ముందు స్వరాజ్యం సంపాదించాలని సంకుచితమైన, హ్రస్వదృష్టితో పలికిన డాక్టరు పట్టాభిగారి మాటలు చెవులను ములుకులాగున ఉన్నాయి. ఆంధ్రరాష్ట్రం రాలేదుకదా, స్వరాజ్యంకూడా ఎండమావులలో చప్పితీర్చుకోవడంలాగున అయినది. ఇంకెన్ని సంవత్సరాలు, ఇపుడు పెరిగిన వైషమ్యాలు, కక్షలు మొదలయిన విషవాయువులను సంహరించి ఐక్యభావంతో పనిచేసి స్వరాజ్యం సంపాదించడానికి కావాలి? ఇదివరకు గాంధిగారు ఒక యేడాదిలో వస్తుందన్నారు స్వరాజ్యం. మొన్న సరోజనీదేవిగారు ఐదేండ్లయినా పట్టుతుందన్నారు. ఐదేండ్లు, ఏఁయిఏండ్లు కావచ్చును. ఆంధ్రదేశం వంటి పెద్దరాష్ట్రంలో ప్రజకు వెన్నెముక విరిగిపోయిన తరువాత, దేశాభ్యుదయమునకు అత్యవసరమైన ఆంధ్రోద్యమము వెర్రితలలు వేసినతరువాత, తలపెట్టిన ఒక్క ఉద్యమమూ కొంచెమైన ఫలవంతము కాకపోయినప్పుడు ప్రజకు కాంగ్రెసు నాయకులయందు ఏవిధంగా విశ్వాసం ఉంటుంది? కాంగ్రెసు వల్ల ఆంధ్రదేశానికి, తన శక్తిసామర్థ్యములందు అవిశ్వాసం జనించింది. అవిశ్వాసం కలిగినతరువాత, మళ్ల కూడ గట్టుకొని రాగల మహానాయకుడు ఆంధ్రదేశంలో పుట్టు

తాడన్న ఆశ నిరాశ కావచ్చును. కాంగ్రెసు ఉద్యమం వచ్చి ప్రజలలో ఓరిమి, పరస్పర విశ్వాసము, జట్టుగూడి కృషిచేయుట మొదలయిన మంచి గుణాలను మంటగలిపివేసింది. కాంగ్రెసు వాళ్లే తమలో, శిక్షణలేదని గోలపెట్టుకున్నారు. కాంగ్రెసువాళ్లలో జెయిలుకు వెళ్లితేనేగాని దేశభక్తుడు అనిపించుకోడానికి అర్హత లేదన్న సంకుచిత మూఢభావం జనించింది. అందుచేత ఇతరులన్నా, యితర ఉద్యమాలన్నా ఈర్ష్య పుట్టింది. అందరానిపండ్లకు అర్రులు చాచి ఉన్నది కాస్తా పోగొట్టుకున్నాడు ఆంధ్రుడు వెనుకటి ఈసపు కథలలో చెప్పిన పేరాసగల కుక్క కథలోవలె. కాంగ్రెసు ఉద్యమం రావడంవల్ల ఆంధ్రుడు ఆంధ్రదేశంలోనే కాదు. బయటకూడా పలుకుబడి గౌరవం పోగొట్టుకొన్నాడు. చివరకు కాంగ్రెసు ప్రెసిడెంటుపదవి కాంగ్రెసుపుట్టి ఏభయి యేండ్లయినా, ఆంధ్రుడికి ఒకమారయినా లభించలేదు. ఇపుడు లభిస్తుందని ఆశకూడా లేదు. చివరకు ఆంధ్రోద్యమం వదిలిపెట్టి, కాంగ్రెసు ఉద్యమం చేపట్టడంవల్ల, ఆంధ్రునికి అన్యదేశాలలోనూ భిక్ష లేకపోయింది.

*　　*　　*　　*

. మన ఆంధ్రనాయకులను విమర్శిస్తూ వ్రాసినందులకు నన్ను ఎవరూ తప్పపట్టకండి. నా అభిప్రాయం తెలుసుకొని తరువాత, నాదోషం ఉంటే కోపం వహించండి—వెనుక ఒకమాటు—వీరేశలింగం, అప్పారావుగార్లను నేను గట్టిగా విమర్శించాను—వాళ్ళు తమ దేశాన్ని, తమ తోడి ఆంధ్రులను నిరసించి, హేళన చేసినారు—వారు వ్రాసిన వ్రాతలకు ఆంధ్రుడు—జాతీయాభిమానం గల ఆంధ్రుడు, పూర్వచరిత్ర కొంతవరకైనా తెలిసిన ఆంధ్రుడు లోలోపల దుఃఖమును మ్రింగినాడు. ఒకమాటు మాకిట్రివేళ్లతో ఆంధ్రజాతీయాభిమానము, సంప్రదాయములు, గుణసంపత్తి మళ్లీ తలవేయకుండా ఎండిపోయినవి. వారి వ్రాతలతో తప్పులున్నచోట, ఎరిగి దిద్దుకొనే శక్తి, ఉడుకెత్తినట్లు నశించిపోయింది. దేశంలో పూర్వం మంచీ వస్తూ కొనఊపిరితో ఉన్న వెలుగు ఒక్కసారిగా ఆర్పివేయబడినది. ఇపుడు తిరిగి ఆ ఆంధ్రజ్యోతి వెలిగించగల నాయకుడు ఆంధ్రదేశంలో అవతరించేటంతవరకు, మనము ఇపుడున్నరీతిగానే, దైన్యమునందు పొరలాడుతూ ఉండాలి!

*　　*　　*　　*

ఈ ఇరవయ్యోశతాబ్దం ప్రారంభించినప్పటినుంచి, ఆంధ్రునికి ఆంధ్రదేశం పొలిమేరలు దాటి వలసపోయిననాడు గాని భిక్ష పుట్టకపోతున్నది. ఆంధ్రదేశంలో ఉండిపోతే చిర్రావూరి యజ్ఞేశ్వరచింతామణి, ఉద్దుగంటి రాఘవేంద్రరావుగార్లను పేరుప్రతిష్ఠలు ఎంతవరకూ వచ్చేవో? వారి గొప్పదనము ఆంధ్రదేశం గ్రహించడం లేదు. ఇంకా కొన్ని దశాబ్దాలవరకు గ్రహించలేదని నిశ్చయంగా చెప్పవచ్చును. కుందూరి ఈశ్వరదత్తును చూడండి. చావలి హనుమంతరావు, కవుతా రామమోహనశాస్త్రి, అతని సోదరుడు, మొదలయినవాళ్లను ఎందరొన్నో చూపించవచ్చును. ఒక పెద్ద జాబితా వ్రాయ నక్కరలేదు. కండ్లువిప్పి, కలయజూస్తే ఆంధ్రభూమిని విడిచిపెట్టి పైకి వెళ్లిన ఆంధ్రుడే పైకి వచ్చి ధృవనక్షత్రంలాగున కనబడుతున్నాడు. ఈ దేశంలో పుట్టి పెరిగి, చచ్చిన ఎంతగొప్పవాడినైనా ఈనాటి ఆంధ్రులు—కొన్ని కారణాలవల్ల—మెచ్చుకోజాలకున్నారు. వారి కళ్లకు మశకాలవంటి చిన్న తప్పులు, ఒకరిని బాధించని లోపములు, గోరంతలు, కొండంతలుగా కనబడుచున్నవి. ఈనాడు ఆంధ్రుడు, ఎవరి గొప్పా మెచ్చడు. తన సాటి ఆంధ్రుడు గొప్పవాడవుతున్నాడని సంతోషించి, తాను వీరారాధన చేయుటకు మారుగా, వాడు ఆగొప్పదనమునుండి, బూడిదలో పడిపోయేవరకు నిద్రపోడు. ఒప్పులు వెదకి, తప్పులుగా చూపించడం ఆంధ్రునికి గిట్టదు. గొప్పదనం—ఎంత ఉన్నా చిన్న చూపుతో చూడడం ఆంధ్రునికి ఎంతో ఉబలాటం కలిగించే పని—ఎందరో ఆంధ్రులు ఈ దేశం విడిచిపోయి పైదేశాలలో పేరు తెచ్చుకొని బ్రతికి ఉండడంవల్ల, ఆంధ్రదేశానికి రావలసిన ప్రతిష్ఠ, కలగవలసిన భాగ్యము పొందవలసిన ఉచ్చదశ—ప్రాప్తించడం లేదు.

*　　*　　*　　*

ఆంధ్రులవి అసలు మొదట్లో, సంగీతము, నృత్యము, అభినయము మొదలయిన లలితవిద్యలు. వారికవి పూర్వయుగములందు వెన్నతోడ పెట్టినవి. పూర్వాంధ్ర చక్రవర్తుల శాసనములను విలాసంగా చూచినపుడు వారు కవిగాయక కల్పతరువులను బిరుదును గర్వంగా ధరించినట్లు గోచరిస్తుంది. వారు "సకలకళాకోవిదులు". రెండువేలేండ్లనుంచి ఆంధ్రదేశాధిపులు, నటులను, గాయలకులను రావించి పోషించినట్లు చరిత్ర నాకొనుచున్నది. సుమారు నూరు నూటయేబది సంవత్సరములనుండి నాట్యము, అభినయము, సంగీతము మొదలయిన విద్యలన్నీ ఆసలాంధ్రభూమిలో అంతరించిపోయినవి. కూచిపూడి భాగవతులు, సంగీతపాటకులు, నటులు వస్తే వారిని సత్కరించి వారి విద్యను పోషించడానికి మారుగా, వారిని, వారి విద్యను కూడా హేళన చేసి నిరసించినారు ఆంధ్రులు. ఆంధ్రదేశంలో నివసించే ఆంధ్రులకు—ఆంధ్రదేశపు లలితకళలకు నివాసం లేకుండాపోయింది. భరత నాట్యము, అభినయము సంగీతము మొదలయినవి పరిసరప్రాంతములందు తల దాచుకొనుటకు పారిపోయినవి. పూర్వము ఆంధ్రదేశంలో ఈ కళోపాసకులు ఏవిధంగా తమ విద్యలను ప్రదర్శించి, ప్రజల హృదయముకు ఆనందము కలుగజేసేవారో, వారి విద్య ఎట్టిదో, స్వరూపము కాదు కదా, మచ్చుకు కూడా మనకు నేడు కరవైపోయింది. ఈదుస్థితి తలచుకుంటే అశ్రుకణములు దొరలుతవి. ఆంధ్రుల విద్య అంతా అరవలు పోషించుకుంటూ ఆదరము చూపిస్తున్నారు. తిరిగి మన విద్యలను మనము అలవరచుకొని, మన దేశానికి కొనిపోతామేమో అన్న భయం చూపించి, మనలను దగ్గరకు రానీయకుండా ఉన్నారు. ఆంధ్రుల సంగీతము, భరతనాట్యము, ఆంగికాభినయము పూర్వం ఆంధ్రభూమిలో ఏలావుండేవో చూపించేవారు ఇప్పటికి తమిళనాడులో ఉన్నారు. తంజావూరు జిల్లాలో కావేరినది పారే సీమలలో మేలత్తూరు, కూలమంగళం ఉత్తుకాడు మొదలయిన గ్రామాలలో ఈ విద్యలన్నీ కూచిపూడిలో వర్ధిల్లినట్లే

నేటికి కూడా ప్రవర్ధమానంగా పెరుగుతూ ఉన్నవి. అక్కడ ఉన్న అరవవారికి తమ అరవంమీదకంటె, సంగీతానికి సెలవయిన ఆంధ్రం మీదనే అభిమానం మెండు—అక్కడ భాగవతులు, కథ—కలాపం అంతా ఆంధ్రంలో వినిపిస్తారు. ఆంధ్రంలో సంగీతం పాడుతారు. ఆంధ్రంలోరచించిన దరువులుపాడుతూ, నృత్యంచేస్తూ, అభినయం, చేస్తూ నాటకములాడుతారు. మనమిక్కడ, మనదేశంలో అసహ్యించుకోవడంవల్ల, వీధినాటకములు, భాగవత కలాపములు, మొదలయినవి శల్యగత ప్రాణములతో ఉంటున్నవి. వీటిమీద విద్యాధికుల మనిషిగ్రహీనే, గ్రుడ్డివారికి ఆదరం లేదు. చివరకు అవి ఎలావుంటవో, అని చూద్దామనే ఉబలాటమే లేదు.

*   *   *   *

ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం రాకపోయినా, అట్టిది కొంతకాలం దాకా రాకుండా వుండడానికి ఆంధ్రయూనివర్సిటీ అడ్డుతలిగి కూర్చున్నది. యూనివర్సిటీ వచ్చిన తరువాత ఆంధ్రులకు ఏమీ ఉపకారం జరిగిలేదు. ఉపకారం లేకపోతే మానిపోయెను, అపకారం మాత్రం జరిగింది. క్రొత్తనీరు వచ్చి ప్రాతనీటిని కొట్టేసినట్లు, ఆంధ్రయూనివర్సిటీ వచ్చి, కలుగుతూ, ఏర్పడుతూ ఉన్న ఆంధ్రుల ఐకమత్యమును కునుటిలోనికి త్రుంపివేసినట్లు చేసింది. తిరిగి ఆంధ్రదేశంలో ఉభయప్రాంతాలవారికి ఐక్యభావము కుదిరే చిహ్నాలు ఏమీ గోచరం, కావడం లేదు. మరొకాలంలో, యూనివర్సిటీ ఏర్పడడం వల్ల కలిగిన అపకారం సవరింపబడాలి—ప్రస్తుత పరిస్థితులు దానికేమీ తోడ్పడవు. ఆంధ్రదేశం ఈ విధంగా విభజింపబడి, ఆంధ్రులు శాశ్వతంగా ఐక్యభావము లేక అల్లాడుతూ ఉండవలసి విధి వ్రాత అగుపడ కనబడుతున్నది. ఆంధ్రదేశ విభజనము, వంగదేశవిభజనము వంటిది కాదు. వంగదేశీయులకు స్వజాత్యభిమానము, స్వదేశాభిమానము తలమునకలుగా ఉన్నాయి. ఆంధ్రులకు ప్రగల్భాలు కొట్టినంతగా దీక్ష లేదు—దేనికైనా హృదయాంతరాళంవఱకు పట్టుకలనాటుకొననీయరు ఆంధ్రులు. తమలో ఉన్న లోపము తెలుసుకొని తప్పు దిద్దుకోరు—ఆంధ్రయూనివర్సిటి మాట వచ్చింది కాబట్టి అను కోవలసివచ్చింది. ఆంధ్రయూనివర్సిటీవల్ల, ఆంధ్రదేశానికి లాభం కలుగలేదంతే కాదు [illegible] ఉదాహరణాలు చాలా ఉన్నవి. మొదటిది ఆం[illegible]కు ఏమీ ఉపకారం జరుగలేదు. ఇప్పుడు దక్షిణాన మళయాళీలు, ఉత్తరాన అస్సామీలు తమకు ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయమే కావలె నని గోలపెట్టుతున్న దెందులకు? తమ భాష అభివృద్ధిపొంది, తమ ప్రత్యేక జాతీయత ఏర్పడి, వృద్ధిపొందవలె ననే కదా! ఆమాటలు వారు ఘంటారవం వలె చెవులు గింగురుమనేటట్లు చెబుతున్నారు. అలాగే ఓఢ్రులు మహారాష్ట్రులు కూడా ప్రత్యేక విశ్వవిద్యాలయాలు కోరుతున్నారు. వారందరు తప్పకుండా విశ్వవిద్యాలయాలు సంపాదింప కోనవలసినదే! కాని ఆంధ్రయూనివర్సిటీవంటిది మాత్రంకద్దు. దేశభాష, దేశచరిత్ర అంటే అభిమానం చూపించే యూనివర్సిటీ అయి యుండాలి. వారిపుడు ప్రకటిస్తూ యున్న ఆశయములను ఆచరణలో పెట్టగలిగే యెడల అన్ని విధములచేతను కేరళయూనివర్సిటీ అస్సాము యూనివర్సిటీలు తప్పకుండా ఆంధ్రయూనివర్సిటి కంటే చాలా బాగా వర్ధిల్లగలవు దేశాభ్యుదయమునను తోడ్పడగలవు. మన ఆంధ్రయూనివర్సిటీ నెలకొల్పబడిన తరువాత స్థాపింపబడిన అణ్ణామలై యూనివర్సిటీ తమిళ భాషను అభివృద్ధిపరచి, తమిళచరిత్రను ఉద్ధరించి తమిళప్రతిభను, తమిళుల ఔన్నత్యమును తమిళప్రజకు చాటి చెప్పవలయు నను సంకల్పముతో పనిచేయుచున్నది. మద్రాసు విశ్వవిద్యాలయము కూడా అంతే. ఆంధ్రంమీద మద్రాసు విశ్వవిద్యాలయమునకు కొంచె మేనా అభిమాన మున్నది. తమిళనిఘంటువు (టమిల్ లెక్సికను) లాంటిది ఆంధ్రమునకు వ్రాయించడానికి పూనుకొనకపోయినప్పటికి, ఆంధ్రభాషకు ఆంధ్రవాఙ్మయమునకు పరిశోధన కొంత అవశ్యక మని యెంచి అందుకు తగిన పండితబృందము నైనా ఏర్పాటు చేసింది. అటువంటి మాట ఆంధ్రయూనివర్సిటిలో స్మరించరాదు. పైకి అంటే మహాపాతకం కూడాను. పైవారిక కోపం వస్తుంది. బిడ్డపాప లెరుగని గొడ్రాలికి పసిపాపలపై ఎంత ప్రేమ వుంటుందో, ఆంధ్రయూనివర్సిటీకి ఆంధ్రభాషపై అంత ప్రేమ ఉన్నది! ఈ మధ్య, ఒకమారు, ఆంధ్రయూనివర్సిటీ పోషకు లయిన శ్రీజయపురం మహారాజావారు, శ్రీ విక్రమదేవవర్మ మహారాజులుంగారు, ఆంధ్రంలో స్వతంత్ర మైన కవిత్వము, వాఙ్మయము, మొదలయినవి ఏమీ లేవని నిరసించినారు. వారు క్షత్రియులు; ఆంధ్రపండితు లని కవు లని ప్రఖ్యాతి గాంచినవారు. వారన్నది, అవునో కాదో చెప్పడానికి ఆంధ్రయూనివర్సిటీకి తాహతు లేకపోయింది. ఆంధ్రులకు ఆంధ్రాభిమానం ఉంటే కదా! యూనివర్సిటీ కలిగిస్తే కదా!

ఆంధ్రయూనివర్సిటీకి మంచి భాండాగారము. అందుకు ఆంధ్రభాష అభివృద్ధిపొందించడానికి వీలయిన గ్రంథములు అందులో ఏమీ లేవు. ఆంధ్రభాషకు ఏమి గ్రంథములు అవసరమో తెలియడానికి, తెలిపితే తెలుసుకోడానికి యూనివర్సిటీ లైబ్రేరియను ఆంధ్రుడై తే గదా! ఆంధ్రదేశంలో, ఆంధ్రులలో ఆ పదవికి తగిన పండితులు లేరన్నట్లు పైనుంచి తెచ్చుకున్నాము. ఆంధ్రునకు ఆంధ్రదేశంలో ఆదరణ ఏది! ఆంధ్రభాషకు ఒక రీడరు పరిశోధనకు ఒక పరిశోధనశాఖ కరవుగా నున్నది. ఇపుడున్న లెక్చరర్లకు పండితులకు భాషావిషయక పరిశోధనకు అవకాశములు లేనేలేవు. ఆంధ్రభాషాపరిశోధనకు సాధనము లయిన పాళీ, ప్రాకృత, సంస్కృతాది భాషలకు ఆంధ్రయూనివర్సిటీలో పండితులు లేరు. ఉపాధ్యాయులు లేకపోయినప్పుడు, విద్యార్థులు ఎక్కడినుండి వస్తారు! ఉపాధ్యాయులు, పండితులు ఉండి పరిశోధన చేస్తూ ఉన్ననాడు, ఆంధ్రయూనివర్సిటీ పేరు సార్థక మవుతుంది. బహుశః యూనివర్సిటీ అధికారులకు ఆంధ్రంమీద అభిమానం లేదు కాబోలు! వారు ఆంధ్రులుగారో! ఆంధ్రభాషమీద ఎంత నిరభిమానమో ఆంధ్రచరిత్ర దక్షిణదేశచరిత్రములపై కూడా అంత అనాదరణమే! ఇతరవిశ్వవిద్యాలయములు, వాటిలో ముఖ్యములయినవి; కలకత్తా, అలహాబాదు, లక్నో, బొం

కాయి, ఢక్కా, మద్రాసు, మైసూరు, పంజాబు, బెనారసు హిందూయూనివర్సిటీలు, హిందూదేశచరిత్ర, అందు ముఖ్యముగా పరిశోధింపవలసియున్న దక్షిణదేశముల చరిత్ర, ఆంధ్రదేశచరిత్రలకు ప్రాముఖ్యము నిచ్చి, వాటి పరిశోధనల నిమిత్తము పండితు లయిన వారిని రీడర్లగా నియమించి కృషి చేస్తూ ఉంటే, ఆంధ్రయూనివర్సిటీ ఆంధ్రదేశచరిత్ర, భరతఖండచరిత్ర యందు మరుపునకు రాని—మువ్వూరు మహాసామ్రాజ్యములను నిర్మించిన మహాంధ్రజాతియొక్క చరిత్రను బోధించుటకు గాని, పరిశోధన చేయుటకు గాని ఏర్పాటులు చేయలేదు.

ఆంధ్రయూనివర్సిటీ అధికారులకు ఇది తోచలేదో? తోచినచో ఇట్లేల యుపేక్షను, ఔదాసీన్యమును చూపింతురు? ఆంధ్రభాష అన్నా ఆంధ్రదేశచరిత్ర దక్షిణదేశచరిత్ర లన్నా, ఆంధ్రయూనివర్సిటీ అధికారులకు సవతితల్లి ప్రేమ. ఇది చాలా దుస్సహమైన విషయము. దుఃఖకరమును, సంతాపకరమును కూడాను. కాని ఆంధ్రుల మొఱ లాలకించే దైవం లేడా?

* * * * * *

ఈ మధ్యను ఆంధ్రయూనివర్సిటీ వారు ఎకనామిక్సు, పొలిటిక్సు ప్యూర్ కెమిస్ట్రీ, అప్లయిడు కెమిస్ట్రీలు బోధనచేయుటకు నలుగురినో, ఇద్దరినో ఆచార్యులను (ప్రొఫెసర్లను) పెద్దపెద్ద జీతాలనిచ్చి నియోగిస్తారని తెలియుచున్నది. ఈ పెద్ద యుద్యోగాలకు ఆంధ్రులలో పండితులు, పైప్రాంతాలవారికి ఏమాత్రము తీసిపోని పండితు లుంటే, వారిని, ఏర్పాటు చేస్తారేమో చూడవలసియున్నది. అలాగున చేయని నాడు ఆంధ్రునకు ఆంధ్రాయూనివర్సిటీవల్ల మోక్షము లేదన్న మాట!

మనదేశంలో ఉన్న సంస్థానము లన్నింటిలో వెంకటగిరి, విజయనగరములు పెద్దవి; పిఠాపురం మొదలయినవి కూడా ఉన్నవి. వెంకటగిరి, విజయనగరములు స్వదేశసంస్థానము లయి, స్వపరిపాలనము అనుభవిస్తూ ఉంటే ఆంధ్రదేశానికి కొంత లాభం ఉండేది—ఆంధ్రుల ప్రతిష్ఠ, ప్రాచీనసంప్రదాయములు, ఔన్నత్యము, కొంత వఱకైనా మనకు కండ్లయెదుట కనిపిస్తూ ఉండేది. కన్నడులకు మైసూరు ఉన్న దంటే, దానిలాభం ఎంత ఉన్నదో, ఆంధ్రుడు ఒకసారి మైసూరు రాజ్యం, కన్నడదేశం తిరిగి చూచిరావలెను. అప్పుడు గాని ఆంధ్రదేశంలో స్వపరిపాలనము గల సంస్థానములు ఉంటే వచ్చే ఫలము బోధపడదు—మలయాళీలు ఇంత పైకిరావడం కొచ్చి, తిరువాన్కూరు రాజ్యము లుండుటచేత్తే యని అక్కడకు వెళ్లి చూచి వచ్చిన వారు చెప్పగలరు. ఈ వెంకటగిరి, విజయనగరములు, స్వపరిపాలనము గల సంస్థానము లయి యుంటే, ఆదాయమునందు, వైశాల్యమునందు, భాగ్యసంపత్తియందు, ఇందూరు, బరోడా, తిరువాన్కూరు సంస్థానములతో సరిసమానమైన పదవి నందియుండేవి. ఆంధ్రులకు ఆభాగ్యం ఆదిలోనే లేకుండా పోయింది. కాని ఉన్న భాగ్యం కూడా అనుభవించడానికి ఆంధ్రుడు నోచుకోలేదు—ప్రత్యేకాంధ్రరాష్ట్రము, ఆంధ్రనగరము లేకపోవడంచేత ఈసంస్థానాధిపతులు తమ డబ్బంతా ఇతరరాజధానినగరాలలో ఖర్చుపెట్టి, ఆంధ్రదేశానికి సౌభాగ్యము మరింత దూరం చేసేస్తున్నారు. విజయనగరం మహారాజా—ఇప్పుడు పదచ్యుతుడైనాడు—, కాని పదవి ఉన్ననాడు దేశంమాట గాని, తన సంస్థానము యొక్క పూర్వపు సంప్రదాయముల మాట గాని, ఔన్నత్యము గాని ఒకనాడు తలచుకోలేదు. భగవంతు డిచ్చిన ఐశ్వర్యమును, పదవిని, దేశంకోసం, తమకోసం సద్వినియోగం చేసుకొని కీర్తిని సంపాదించుకోడానికి ఆంధ్రదేశంలో పుట్టిన శ్రీమంతులు పెట్టిపుట్టలేదు. విజయనగరమహారాజకుమారులైన శ్రీపూసపాటి కుమారఅనందగజపతిమహారాజా లుంగారు ఆంధ్రదేశపు సంస్థానాధీశులైనను ఆంధ్రదేశంలో, తనకు మిక్కిలి ప్రియతమమైన క్రికెట్టుఆటనుపోషించరు. ఆంధ్రదేశంలో జీవం కూడా కళతో పాటు శుష్కించిపోతూ ఉన్నది.

* * * *

ఇంతెందుకు! ఆంధ్రదేశంలో ఒక ఆంధ్రదైనికపత్రికకు కంటె, ఎక్కువ పత్రికలకు తావు లేకుండా ఉన్నది. వారపత్రికలు, మాసపత్రికలు ఉన్నాయంటే ఏవో ఒకటిరెండు పత్రికలు మినహాయిస్తే మిగిలినవాటికి దినదినగండము దీర్ఘాయువు అన్నట్లున్నది. ఒక అణా చొప్పున ఇచ్చి, ఎన్ని మారులైనా కాఫీకప్పులు త్రాగును కాని చదువుకున్నవాడ నని గర్వపడే ఆంధ్రుడు, సొంతానికి ఒక అణా ఇచ్చి ఒక ఆంధ్రపత్రికను కొని చదవడు. అతని కది అవమానంగా వుంది. కాని ఆంధ్రమును ఈసడించుకొని, హిందీని చూచి మురిసిపోతున్నాడు.

* * * *

వేయిమాట లెందుకు? ఎటుచూచి నాంధ్రులకు ఆంధ్రదేశంలో యోగం పట్టడం లేదు. భాషాభివృద్ధి, జాతీయాభివృద్ధి కూడా కనుబొమలమీది వెండ్రుకలవలెనే ఎదుగు బొదుగు లేకుండా ఉన్నాయి. ఇంతకీ చెప్పవలసిన మాట ఆంధ్రునకు ఆంధ్రదేశంలో భిక్ష పుట్టడం లేదు!

విరాళములు

ఈ నెలలో ప్రబుద్ధాంధ్రను సత్కరించినవారు

౧	శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుపంతులువారు ఆంధ్రభారతీపత్రికల అధిపతులు మదరాసు.	౨౫-౦-౦
౨	శ్రీ వాపిల్ల వేంకటేశ్వరశాస్త్రిగారు త్రిలింగ, ఫెడరేటెడ్ ఇండియాపత్రికల సంపాదకులు-మదరాసు	౧౦-౦-౦
౩	శ్రీ వెలువలూరి వేంకటకృష్ణారావుపంతులుగారు గవర్నమెంటు తెనుగు ట్రాన్సులేటరు మదరాసు	౫-౦-౦
౪	శ్రీ క. రామనాథంపంతులుగారు బి. ఏ. మదరాసు	౫-౦-౦
౫	శ్రీ జి. భాస్కరరామచంద్రరావు పంతులుగారు ఉలవభద్ర ప్రొప్రయిటరు. పర్లాకిమిడి	౫-౦-౦
౬	శ్రీ కంభంపాటి సత్యనారాయణగారు లాండులార్డు అవిడిగ్రామం	౫-౦-౦
౭	శ్రీ క. సూర్యనారాయణగారు మద్రాసు	౫-౦-౦

చిన్నయసూరి ప్రయోగ విమర్శనము

గిడుగు వేంకటసీతాపతిగారు—బి. ఏ. ఎల్. టి

"ఉదయిని" సంపుటము ౧. సంచిక ౪ లో "శృంగాటక" మనే శీర్షిక క్రింద విమర్శకు లెవరో కొన్ని విషయములు ముచ్చటిస్తూ, "చిన్నయసూరి పాండిత్యం ఆక్షేపణకు పాత్రమయింది. వ్యాకరణదోషమే దొరికిందట—అట! "వినోదిని" (ఈ అగస్టుసంచిక) సమాలోచనలో 'నీతిచంద్రిక? తొలివాక్యం చిన్నయసూరికి అప్రతిష్ఠ తెచ్చింది; "గంగాతీరమున సకలసంపదలు కలిగి పాటలీపుత్రమను నగరము కలదు." అని ఆవాక్యము. "కలిగి" అన్వయం "చిన్నయ్యా అయినా చెప్పలే" డనుకొన్నారు. భారతములో "కరుణకలుగుమమ్మ కమలనేత్ర" (ఆది. ౭. ఆ.), "అంతయెుకలేసె" (అర. ౧. ఆ.) అన్న సందర్భాలలో 'కలుగు' సకర్మకంగా కట్టి శబ్దరత్నాకరకారుడు అన్వయం చెప్పి ఉన్నాడు. దీనికిచిన్నయ్యను పిలువనక్కఱలేదు. మొదటి 'కలిగి' అన్నప్పుడు సకర్మకంగాను, 'కలదు' అన్నప్పుడు అకర్మకంగాను గుర్తించినప్పుడు చిన్నయ్యా, మరి పెక్కుమందీ శాంతిచెందినవా రవుతారు." అని వ్రాసినారు.

గాని, ఇంతమాత్రాన శాంతి కుదిరే విషయం కాదది. ప్రాచీనాంధ్రభాషవిషయములన్నిటను చిన్నయసూరిగారి నీతిచంద్రికా బాలవ్యాకరణములున్ను, శబ్దరత్నాకరమున్ను ప్రమాణముగా పండితులందరున్ను గ్రహిస్తున్నారని గాని గ్రహించవలెనని గాని చెప్పడానికి వీలులేదు. ఈ 'కలుగు' విషయమై వ్రాయవలెనంటే ఒక పెద్దవ్యాసము వ్రాయడానికి అవకాశమున్నది. దీనిని గురించి సవిస్తరముగా వ్రాయవలెనని మా తండ్రిగారు, రావుసాహెబు గిడుగు వెంకటరామమూర్తిపంతులుగారు ఆలోచించినారు గాని, ఇప్పుడు మఱియొక పనిలో నిమగ్నులై ఉండడమువల్ల వ్రాయలేరు. నాకైనా తీరుబడిలేదు గాని ఈవిషయము చర్చకు వచ్చినది గనుక, దీనికి సంబంధించిన ముఖ్యవిషయములు సంగ్రహించి తెలియజేస్తున్నాను.

కలుగు ధాతువు సకర్మకము కాదని కీ. శే. వేదము వెంకటరాయశాస్త్రిలువారి మతము.

శ్రీనాథుని శృంగారనైషధమునకు తాము వ్రాసిన సర్వంకషావ్యాఖ్యలో సప్తమాశ్వాసమున తొమ్మిదవ పద్యమందున్న "పరిసరములమీఁదఁ గరుణగలుగుము" అనే వాక్యమునకు అర్థము వ్రాస్తూ, "కరుణగలుగుము=దయగలిగియుండుము" అని వ్రాసి, "కలుగు" ధాతువు అకర్మకమా సకర్మకమా అనే విషయము చర్చించి, శాస్త్రిలువారు తమ అభిప్రాయము ఎట్లు తెలియజేసినారో చూడండి:—

"'కరుణగలుగు'—కలుగు ధాతువునకు 'పొందు' అను నర్థమనియు నాయర్థమున నది సకర్మమనియు తెలిపి సీతారామాచార్యులవారు 'కరుణగలుగుము' అని యుదాహరణమొసంగినారు. అది కరుణగలిగియుండుము' అనుటకే శబ్దపల్లవకల్పప్రయోగవిశేషమనియు ధాతువు సకర్మము కాదనియు మదీయాభిప్రాయము; వారు ఈయర్థమునకువ్యుత్పత్తికమునందు చూపిన ప్రయోగము 'లేసె' యనునది అస్వార్థమునకు బాలవ్యాకరణమున చెప్పినట్టిదే; సకర్మమనుచో 'వాఁడు నలువురు పుత్రులను గలిగెను', 'వానిచే ధనధాన్యములు కలుగఁబడినవి' అని యిట్టి యనిష్టప్రయోగపరంపరను సాధువుగా నంగీకరింపవలసి వచ్చును. అదియు నిష్టాపత్తియయేని, 'సుఖంబుండు', 'నింకోలగంబుండు', 'కొలువుండు' ఇత్యాదులంబట్టి 'ఉండు' ధాతువును 'పొందు', 'చేయు' అను నర్థంబులతో సకర్మకంబుచేసి 'అతఁడు నలువురు పుత్రులనుండెను', 'వానిచే నలువురు పుత్రులు ఉండఁబడిరి' ఇత్యాది ప్రయోగములను సయితము నంగీకరింపవలసి వచ్చును; వీనియందు 'సుఖముగా', 'ఓలగంబుగా', 'కొలువుగా' అని యున్నమేని ప్రకృతవాక్యమునకు 'కరుణగా' (కలుగుము—ఉండుము) అనియే యర్థము కావచ్చును. కావున సకర్మకత్వమనేము సమ్మతము కాదు."

ఈ శాస్త్రిలవారే ఆంధ్రసాహిత్యపరిషత్తునాఁడు యుగమవార్షిక సమావేశసమయమున సభాధ్యక్షులయి చదివిన ఉపన్యాసములో (చూ. ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక సంపుటము ౬ సంచిక ౧, ౧— పుట ౭౭) ఈ విషయము ఎట్లు చర్చించినారో చూడండి:— ",I have a house" అను వాక్యమునకు తెనుఁగు చెప్పు శిశుబోధకుఁడు తొట్టతొలుత కలుగు ధాతువును సకర్మకముగా గావించినాఁడు. 'I=నేను, a house=ఒక యింటిని, have=కలిగియున్నాను' యతని యుపదేశము. అసంప్రదాయమున సకర్మకత్వము నాటకొంతము వ్యాపించినది. అధునికవాఙ్మయమునందు ఎన్ని ప్రయోగములనైన యుదాహరింపవచ్చును. పఠిత పుస్తకములలోను సమృద్ధిగానే కలవు. మూఁడవతరగతి పాఠపుస్తకమున [Third Class Reader–Marsdens] ౨౪ వ పుట "కటకీలను గొన్న టేనివాఁడ్రమే కలవై యుండును."

ఈ వాక్యము మార్స్డెన్ గారి మూడవ వాచకములో "ఆరోగ్యమార్గము; ఇండ్లు "అనే ౨౪ వ పాఠములోనిది. ఈవాచకము రావుబహుదూర్ కం. వీరేశలింగము పంతులుగారిచేత పరిష్కరింపఁబడినది." "సకర్మకత్వము నాటకొంతము వ్యాపించినది" అని ఇక్కడ వ్రాసినప్పుడు నాతము శాస్త్రులవారికి జ్ఞప్తియందున్నది. వీరేశలింగము పంతులవారు అంగీకరించిన అజ్ఞాన శాసనవేలములోని ప్రయోగమే. "ఆంధ్రకాళిదాసుల గ్రంథములనుండి" అని చూపించిన దోషములలో శాస్త్రిలవారు "లక్షణని గలవాఁడ" అనే ప్రయోగము కనిఁబరిచి, "కలుగుధాతువు ఇట్లు సకర్మకముగుట Have ధాతువు నజ్ఞానకృత దోషము" అని వ్రాసినారు. శాస్త్రిలవారి ఉపన్యాస మంతా వీరేశలింగము పంతులవారి పాండిత్యలోపమును కనఁబరచుటకే ఉద్దేశింపబడినట్లు పంతులవారి పేరు చెప్పకపోయినా పంతులవారి గ్రంథములనుండి ప్రయోగములు ఎత్తి చూపించుట చేత స్పష్టమయినది.

రాఘవ పాండవీయమందలి (ఆ. ౧. ప. ౧౭) "నెలకొనియె వేంటతేమి నబ్బులియుండు శిశిరనగ సుచిర పరిసర మహిమంగల..." అనే పద్యములో 'మహిమన్‌గల' అనగా 'మహిమను గలిగినట్టి' అని ముద్దరాజు పెదరామన 'కలుగు' సకర్మకముగా చెప్పిన అర్థము విమర్శిస్తూ ఈ శాస్త్రిలవారే తమ "విమర్శ వినోద" మనే గ్రంథములో (చూ. పు. ౫౮) "ఇట నీ వ్యాఖ్యాత రామాయణార్థమును అనావశ్యకముగాను, అశాస్త్రీయముగాను కలుగు ధాతువును సకర్మకముగా అన్వయించినాడు" అని వ్రాసినారు.

శ్రీ. శే. కొక్కొండ వెంకటరత్నము పంతులవారు రచించిన ఆంధ్రప్రసన్నరాఘవమును తాము విమర్శిస్తూ ప్రకటించిన గ్రంథము లో ఈ శాస్త్రిలవారే పంతులవారు కలుగుధాతువు సకర్మకముగా ప్రయోగించిన వాక్యము లాయాచోట్లను విమర్శించి ఆక్షేపిస్తూ "విషయసంగ్రహాదిక" మనే కనుపటభాగమందు (చూ. పు. ౩.) ఈ ప్రయోగములన్నీ పేర్కొన్నారు. వాటిలో నాలుగింటిని మా త్రమే ఎత్తి శాస్త్రిలవారు వ్రాసినది చూపిస్తున్నాను:—

"శోభమానమహిమంగల—అకర్మక ధాతుయోగమున కర్మద్వితీయ యెట్లొకొ యగును!" (చూ. ఆంధ్రప్రసన్నరాఘవవిమర్శనము పు. ౩౭) "సంకటము గలద"—అకర్మకధాతువును అర్థభేదకమును సకర్మకముగా జేయుట! ఇదే గావలయు కవితాతత్వము యొక్క విత్తు!" (చూ. పు. ౧౧౭) "శోభగల—కలుగుధాతుయోగమున ద్వితీయ నిడు హాసమేలకో తెలియలేదు" (చూ. పు. ౧౯౮)

"ప్రయోగమున్నంగల్గగ—ఇందు పాకపూరణను వ్యుత్పత్తియా! కల్గుధాతు సకర్మకతా నియమా!" (చూ. పు. ౨౦౧) కలుగు ధాతువు సకర్మకమనుటకు తగిన ప్రమాణము శబ్దరత్నాకరములో కనబడదు. అందులో సకర్మకమైన 'కలుగు' కు 'పొందు' న్ను, 'పొందు' కు, 'ప్రాపించు' న్ను, 'ప్రాపించు' కు 'పొందు' న్ను సమానార్థములుగా ఉన్నవి. 'పొందు' కు ప్రయోగము 'తెలపెట్టు' క్రింద చూడవలెనని ఉన్నది. అక్కడ చూడగా "కీర్తిపొందెదు విన్నన్" (భార. కిష్కి. ౩) అనే ప్రయోగము కనబడినది. 'కలుగు'న్ను పొందున్ను సమానార్థము లయినప్పుడు "కీర్తికలుగును విన్నన్" అనే ప్రయోగముకూడా సాధువనవలసివస్తుంది.

ప్రాచీనాంధ్రభాషలో సకర్మకమైన 'పొందు' ఈ రీతిగానే చాలాచోట్ల ప్రయుక్తమై ఉన్నది:—

"ఉరగభయము పొందదు జనులన్" (భార. ఆది. ౨. ౨౩౬.)

"పొందవు దుఃఖముల్, భయముపొందదు, పొందదు దైన్యమె
మ్మెయిం
బొందవు తీవ్రదుర్దశలు; పొందు దరిద్రయంబులు, పొందుసంపదల్
పొందు సమగ్రసౌఖ్యములు పొందు సమున్నత కీర్తు లెందు గో
విందపదారవింద సరసీరుహగంధ గరిష్ఠచిత్తులన్"

(శంభుదాసుని లక్ష్మీనృసింహావతారకథ ఆ. ౨. ప. ౩౧.)

ప్రాచీనాంధ్రమందున్న ఈ వాగ్వ్యవహారము అధునికాంధ్రమందు లేదు. ఇప్పుడు 'నేను ఆనందమును పొందినాను' అనేకాని, 'ఆనందము నన్ను పొందినది' అని వాడుక లేదు. ఈ రెండువాక్యములలో దేనియందైనా 'పొందు'కు మారుగా "కలుగు' నిలిపి వాక్యము రచించినయెడల ఆ వాక్యము నేటి వాగ్వ్యవహారము ననుసరించి యుండునా? 'నేను ఆనందమును కలిగినాను; ఆనందము నన్ను కలిగినది' అని ఎవరును అనరుగదా! "వానికి నలుగురు పుత్త్రిలు కలిగిరి" అనవచ్చునుగాని; "వాడు నలుగురు పుత్త్రిలం గలిగెను" అనిగాని, "వానిని నలుగురు పుత్త్రిలు కలిగిరి" అనిగాని అనరాదుగదా!

"కరుణ గలుగు మమ్మ" అనగా 'కరుణ కలిగి ఉండుము, కరుణ గల దానవు కమ్ము' అని అర్థము. 'వాడు కరుణ గలడు' అంటే 'వాడు కరుణ గలవాడు' అని అర్థము. "వాడు కరుణ గలవాడు' నేను కరుణ గలవాడను" మొదలైన వాక్యములలో 'గల' కు మారుగా 'ఉన్న' ప్రయోగించవచ్చును. వీటిలో 'కరుణ' కర్తయగును గాని కర్మ కాదు.

కలుగు ధాతువు సకర్మకముగా సైతము ప్రయోగించవచ్చునన్న వాదము నెగ్గినా, ఇప్పుడు మనము విమర్శిస్తూ ఉన్న చిన్నయసూరిగారి వాక్యము అన్వయశుద్ధి చెడిన వాక్యమని చెప్పకతప్పదు. ఈ వాక్యములోని దోషము కలుగు ధాతువు సకర్మకముగా ప్రయోగించుట వల్లనే కలిగినది కాదు. ఈ వాక్యరచన ఆంధ్రవాగ్వ్యవహారమునకు—(ప్రాచీనాంధ్ర వాగ్వ్యవహారమునకు గాని, అధునికాంధ్ర వాగ్వ్యవహారమునకు గానీ) విరుద్ధముగా ఉన్నది. వాక్యాంతమందున్న 'కలదు' భూతభవిష్యద్వర్తమానకాల వివక్ష లేని తద్ధర్మార్థక క్రియ. కాల వివక్ష గల క్త్వార్థక క్రియతో దీనికి అన్వయము పొసగదు. "గంగాతీరమున సకల సంపదలం బొంది పాటలీపుత్రమను నగరము గలదు" అని రచించినా అన్వయశుద్ధి చెడుతుంది. ఈ విధముగానే అన్వయశుద్ధి చెడిన వాక్యము మరియొకటి చిన్నయసూరిగారి నీతిచంద్రిక నుండే ఎత్తి చూపిస్తున్నాను.

దీర్ఘకర్ణమనుపిల్లి జరద్గవమను గద్దతో చెప్పిన మాటలలోని వాక్యము:—

"మిమ్ము ధర్మజ్ఞులని మంచివారని వచ్చుచోటి పక్షులప్పుడప్పుడు ప్రశంసింపంగా విని, బహుదినములనుండీ మిమ్ము మీదర్శనము చేయవలనని కోరిక గలదు."—ఇందులో పైనిచెప్పిన దోషమే కాక మరియొక దోషము సైతము కలదు. వాక్యమందలి క్త్వార్థకక్రియకున్ను ప్రధానక్రియకున్ను కర్త ఒక్కడై ఉండడము సహజమైన వాగ్వ్యవహారము. ఇంగ్లీషుభాషలో సైతము వాగ్వ్యవహారము ఈరీతిగానే ఉంటుంది. "**Having heard that the train arrived,** my **car was sent to the Railway station**" అంటే వాక్యము దుష్టమవుతుంది.

పైని చూపించిన చిన్నయసూరిగారి వాక్యములో క్త్వార్థకక్రియకు కర్త 'నేను' (లోపించినది); ప్రధానక్రియకు కర్త "కోరిక"; కనుక అన్వయశుద్ధి చెడినది.

"చెట్టుపడి నలుగురు చచ్చిరి" వంటి వాక్యములు వాగ్వ్యవహారమందు లేకపోలేదు. ఇందులో 'పడి' అనే క్త్వార్థకమునకు 'పడుటచేత' అని అర్థము. చిన్నయసూరిగారి వాక్యములోని 'విని'కి సైతము 'వినుటచేత' అని అర్థము చెప్పి వారి వాక్యము నిర్దుష్టమనరాదా అని కొందరు ప్రశ్నించవచ్చును. గాని, రెండు వాక్యములున్ను సమానమైన అన్వయముగలవి కావు. 'కలదు' అనే క్రియభూతభవిష్యద్వర్తమానకాలవివక్షగాని కార్యకారణవివక్షగాని లేని కేవల తద్ధర్మార్థకక్రియ. చిన్నయసూరిగారి వాక్యములో ఉన్న 'విని' హేతువును మాత్రమేకాక కాలమును సైతము సూచిస్తున్నది; గనుక, దానికిన్ని 'కలదు' అనే క్రియకున్ను అన్వయము పొసగదు.

పైని చెప్పిన చిన్నయసూరిగారి వాక్యములు ఇంపుగాను నిర్దుష్టముగాను ఉన్నవంటే, ఈక్రిందివాక్యములు సైతము నిర్దుష్టమైనవని చెప్పవలసివస్తుంది.

"గంగా తీరమున పాటలీ పుత్రమను నగరము సకలసంపదలం గలిగి కలదు." (...పొంది కలదు.)

"కాశిలో జ్ఞానముంగలిగి రామేశ్వరములో ఒక యోగికలఁడు" (...పొంది కలడు)

"వానికి కుమారులు విశాల నేత్రములం గలిగి కలరు"

"వాఁడు ఒక కుమారుని ఒక కొమార్తను గని కలఁడు"

"నేను తోఁటలోని పండ్లనుజూచి, ఆ పండ్లను దినవలెనను కోరిక నాకు గలదు."

"నేనొక పుస్తకముం గలిగి దానిని చదువవలెనను కోరిక గలదు."

పైని చూపించిన చిన్నయసూరిగారి వాక్యములో అన్వయశుద్ధి చెడినదని వినోదినీ పత్రికా సంపాదకుల ఆక్షేపమై ఉండును. ఆ ఆక్షేపము సద్యోనమని నా అభిప్రాయము.

స్టార్ కంబైన్సువారి హరిశ్చంద్రటాకీ

ప్రజ, చాలా రోజులనుంచి యెదురు చూస్తూ వున్న టాకీ యిది. పౌరాణికగాథలలో హరిశ్చంద్రోపాఖ్యానానికి గల సౌలామణీపదం దేనికీ లేదు. పైగా, అడవిలోని రంగాలు ఫిలిము తీశాటప్పుడు, సింహం, గద్ద మటూ మీదికి రాగా, హరిశ్చంద్రవేషధారి, జంకి పారిపోకుండా కత్తిదూసి యెదిరించి దాన్నే తరిమివేశా డనీ, అడవి తగులబడిపోవడం వగైరాలు చూపించడానికి చాలా డబ్బు ఖర్చుపెట్టా రనీ, యెంతేనా శ్రమపడ్డా రనీ, పత్రికలలో వార్తల మీద వార్తలు ప్రకటించబడిన తరవాత యిది జమాబందీకి బయలు దేరింది.

కాని, తీరా చూస్తే యేమీ లేదు, ఇదివరకు వచ్చిన తెనుగుటాకీలలో దేనికంటేనూ యిది శ్రేష్ఠంగా లేదు. పైగా యిందులో అనేకదోషా లున్నాయి.

ఈ ఫిలిము తయారుచేసిన డైరక్టరు, డబ్బుఖర్చు మార్గాలు తొక్కడానికి చాలా సమర్థుడై వుంటాడు. ఏమీ సందేహం లేదు; కాని కళాజ్ఞానం, సిద్ధాపిన్నా తారతమ్యం—రామరామా! ఇలాంటివి ఆయన కేమీ తెలిసినట్టు లేదు.

ఆఫిలిములోని కొన్ని దారుణదోషా లివీ.

౧ అంతఃపురంలో, చంద్రమతి, హరిశ్చంద్రుని కాళ్ళదగ్గర కూచుని, అదివరకే ప్రారంభించి వున్న పాట పాడుతోంది. బయట యేదో గోల వినపడింది. "ఏమి" టని హరిశ్చంద్రుడు వులిక్కిపడుతూవుండగా గభీమని సత్యకీర్తి లోపలికి వచ్చాడు. ఒక కబురు లేదు. ఒక పిలుపు లేదు. అతని రాక దాసీ లేనా సొంతంగా రాజు కెందుకు చెప్పారు కారో? అసలు వాళ్లు మంత్రిని లోపలి కెలా విడిచిపెట్టారో? నాగరాజూరావుగా రేనా యీ అమర్యాదపని కెలా సిద్ధపడ్డారో?

౨ రాజు, అడవిలో, వేటాడుకొని అలసివున్నాడు. మాలెతలు వచ్చారు. వారిలో వొక తెకు తెనుగు రాదు. తెనుగు తెలిసిన మాలెత మాట్లాడి ఆజ్ఞ పుచ్చుకుని పాట గానా చెయ్యకుండా ఇంకి నుంచోగా, తెనుగురాని మాలెత, నోరు కుట్టేసుకుని, ఏదో నృత్యం చేసింది. కాని బహుమానం దగ్గిరకివచ్చేటప్పటికి తెనుగుమాలెత కూడా సిద్ధం. ఆమాలెత ముత్యాలహారం వద్దనీ, వొక కాగిలింతో యివ్వవలసిం దనీ కోరగా, మంత్రి వెడిపంతులులాగ వాళ్ళని గదుముతూ కొట్టబోయాడు. చివరికి ఘటులే వాళ్ళని గెంటుకు పోయారు గదా, మంత్రి అలాంటి చిలిపిచేష్టలు చెయ్యడాని కెందుకు పూనుకున్నాడో?

౩ ఆ సందర్భంలోనే రాజొక దిమ్మమీద కూచునివుండగా మంత్రి వెనకవేపున అదిమ్మమీదే వొకకాలు వేసుకుని నుంచున్నాడు. మంత్రి, అక్కూచున్నవాడు హరిశ్చంద్రుడు డేను కొక అద్దంకే గదా అని నిర్లక్ష్యంగా వున్నట్టుంది. ఆతని మెడకి తన చేతులు చుట్టి పక్కని కూచున్నాడు కాడు నయమే.

౪. అడవి అంటుకుంది. చంద్రమతీ, హరిశ్చంద్రుడూ లోపిహితుడూ వేసిన గంతులు చూస్తే ఔచిత్యం అనేది అవసరం లేదని నిశ్చయించుకున్నట్టుంది. నక్షత్రకుడు సరేసరి కొంతకంటే అన్యాయంగా ప్రవర్తించాడు. పరుగులెత్తి పరుగులెత్తి చివరి కందరూ వొక చక్కనిలో బీటిలో కలుసుకున్నారు. అయితే: అడవి యెందు కంటుందీ? అగ్ని చివరి కేమయిపోయిందీ! తగులబడుతూవున్న చోటినుంచి వారు తప్పించుకుని బయటపడ్డారా యిందుకోసం పేర్చబడ్డ యెండుకట్టెలు మండిపోయి నుసి అయిపోవడంవల్ల అగ్ని దానంతట అదే చల్లబడిపోయిందా?

౫. గుర్రుమంటూ వొక సింహం హరిశ్చంద్రుని వేపుకి వురికింది. హరిశ్చంద్రుడు కత్తి విడిచిపెట్టలేదు. అంతవరకూ నిజమే; కాని వొక్కదూకున వెనక్కి పారిపోయాడు. ఆంధ్రపత్రికలోని వార్త చూసి యీఘట్టంకోసం కనిపెట్టుకునివున్నవారంతా యేమనాలో అది అన్నారు. ఏమీ తరవాయి పంచలేదు.

౬. చంద్రమతీ, లోహితుడూ, నక్షత్రకుడూ నిద్రపోతున్నారు. ఏవో గాండ్రింపులు వినవచ్చాయి. హరిశ్చంద్రుడు లేచివెళ్లాడు. చంద్రమతీ, లోహితుడూ, నక్షత్రకుడూ వున్నభాగం మరుగుపడిపోయింది. తరవాత వొక భూతం వచ్చింది. ఒడ్డూ, పొడుగూ, వేషమూ, కంఠమూ భూతానికి తగినట్టే వున్నాయి. భూతానికి యిరవైమూడయి గజాలదూరంలో, కొంచెం కిందుగా హరిశ్చంద్రుడు నుంచున్నాడు. భూతంపట్టుకు భూతమూ, హరిశ్చంద్రుడూ రాజూ కత్తులు తిప్పారు. ఒకరికత్తి వొకరికి గాని, ఎవరికత్తి వారికి గాని తగలలేదు; కాని భూతం మాత్రం నిగ్గదీసెడుతూ నిద్రవచ్చి పడుకున్నట్టు నేలమీద వాలింది. వెంటనే అలాంటిదే మరో భూతం వచ్చి అలాగే చేసింది. ఈభాగోతం యెందుకూ?

౭. అడవి దాటి హరిశ్చంద్రుడు తనవారితో మహారాష్ట్రదేశంలోని వొక పల్లెటూరి చెరువుగట్టు చేరాడు. అప్పుడు కాశీ అనీ, ఆచెరువు గంగ అనీ అనుకో. సాయంకాలం అగి అందరూ చెరువులో కాళ్లు కడుక్కున్నారు. అంతే. నక్షత్రకుడు అక్కడే అపస్వరాల తోటీ, అసందర్భంతోటీ సంధ్యావందనం చెయ్యబోయాడు. అతను సంధ్యావందనం చేశాటప్పుడు చెరువులోని పాచితెట్లు నక్షత్రకుని కాళ్లదగ్గిర స్పష్టంగా కనపడుతున్నాయి. పైగా రాత్రిలో వొక్కరున్నూ అందులో గంగస్నానం చెయ్యలేదు: కాని హరిశ్చంద్రుడు, ఘుమాయించి "గంగాస్నానం అయింది కదా, యిక విశ్వేశ్వరదర్శనం చెయ్యవద్దా" అన్నాడు. మంచి గంగే దొరికింది డైరక్టరుకి. కాని విశ్వేశ్వరుడు మాత్రం దొరకలేదు.

౮. కాలకౌశికుడు దేవతార్చన చేస్తూవుండగా గుర్రుపెట్టి నిద్రిస్తూ వున్న కలహకంఠి లేచి, "నాఫలహారం యేదీ" అంటూ ముందుకి వచ్చి కూలబడింది. అక్కడి పక్కన అసందర్భం లలా వుండనిద్దాం. అది ప్రాతఃకాలమా మధ్యాహ్నమా? ప్రాతఃకాలమయితే కలహకంఠి దంతధావనం చెయ్యకుండా ఫలహారానికి కూచున్నదనాలి. మధ్యాహ్నమయితే: కలహకంఠి భోజనం చేసి పడుకుని, ఫలహారం వేళకి లేచాటప్పటికి కాలకౌశికుడు దేవతార్చన చేస్తున్నాడనాలి. ఎటయినా అసందర్భమే. కాని డైరక్టరుకి ఇదేమీ తోచలేదు.

౯. వీరబాహువు కల్లుకుండ బుజానపెట్టుకుని పాడుకుంటూ వచ్చాడు. వెయ్యి బారువుల బంగారం యిచ్చి హరిశ్చంద్రుని కొన్నవాడతను. అంతటి ఐశ్వర్యవంతుడు స్వయంగా కల్లుకుండ తెచ్చుకోవలసిందేనా?

౧౦. హరిశ్చంద్రుడు చంద్రమతిని నరకబోతున్నాడు, విశ్వామిత్రుడు వచ్చి "రాజా! నేనే వోడిపోయాను. గెలుపు నీదే. నీభార్యను నరకవద్దు" అన్నాడు. నేనే వోడిపోయానంటే? హరిశ్చంద్రుడికీ, విశ్వామిత్రుడికీ యేమీ పందేలు జరగలేదే?

౧౧. ఈశ్వరుడు సాక్షాత్కరించాడు. "నీసత్యసంధతకు మెచ్చాను. నీభార్యను నరుకొద్దన్నాడు. కాశీరాజపుత్రుణ్ణి మళ్లీ బతికించకుండా చంద్రమతికి శిక్ష యెలా తప్పించగలడూ యీశ్వరుడయితే మాత్రం? ఈశ్వరుడు లెమ్మనగా లోహితుడు లేచి తల్లికీ తండ్రికీ, ఈశ్వరుడికీ నమస్కరించాడు. మంగళసూత్రం సంగతి వచ్చేదాకా చంద్రమతి గుర్తించలేని హరిశ్చంద్రుణ్ణి లేచీలేవడంతోటే లోహితు డెలా గుర్తించాడూ?

మొత్తంమీద ఫిలిమంతా యిలాగే అవకతవకలుగా వుంది; కాని ప్రజ విరగబడి పడిపోతోంది.

ప్రజకీ కళ అక్కరలేదు. డైరక్టరుకీ కళ అక్కరలేదు. నటులకూ కళ అక్కరలేదు. ఇక ఆంధ్రజాతా? అది మేలుకునివుంటే కాదూ? —చూసినవాడు

గ్రంథస్వీకారము

ఆంధ్రదశరూపకము

గ్రంథకర్త ఆంధ్రవిశ్వకళాపరిషత్కళాశాలలో సంస్కృతాంధ్రపండితులుగా వున్న పుల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు. ప్రకాశకులు మద్రాసు, వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండుసన్సువారు. పేజీలు ౧౬+౧౨౫. వెల ౧—౮—౦. ఇది రెండో కూర్పు.

ధనంజయమహాకవి దశరూపకానికిది తెనుగుసేత. సూత్రానుకంగా వుంది. వార్తికమూ, ఉదాహరణలూ వున్నాయి.

ఆంధ్రపండితులూ, కవులూ ముఖ్యంగా నాటకకర్తలయితేలూ చదివితీరవలసిన గ్రంథమిది. దేశకాలాలను బట్టి నాటకాల ప్రాశస్త్యం తెలుసుకోవడం చాలా అవసరం.

ఆధునికాంధ్రవాఙ్మయాని కిదొక గొప్ప అలంకారం.

అయితే; శైలి సులభంగానూ, వార్తికం యింకా విపులంగానూ వుంటే చాలా బాగుండేది. మూడో కూర్పులోనైనా, శాస్త్రులవారు, స్వయంకృషి చేసుకునేవారి కుపయోగకరంగా వుండేటట్లు సంస్కరిస్తారని నమ్ముతున్నాము.

విరాళాలు

ఏలేశ్వరపు కృష్ణమూర్తిగారు బి. ఏ. బి. ఎల్. అడ్వకేటు
వెల్లూరు ౫—౦—౦

విశేషచందాలిచ్చి ప్రబుద్ధాంధ్రను సత్కరించినవారు

౧ పొట్నూరి స్వామిబాబుగారు లాండులార్డు
నరసన్నపేట ౩—౦—౦

౨ మోచర్ల సీతారామయ్యపంతులుగారు బి. ఏ.
బి. ఎల్. వకీలు బరంపురం ౨—౦—౦

౩ ఒక పండితమిత్రుడు బరంపురం ౨—౦—౦

౪ డాక్టరు ముల్పూరి రంగయ్యచౌదరిగారు ఏలూరు ౨—౦—౦

ఏ ఆడావిడీ లేకుండా, ఏ గడబిడా చెయ్యకుండా, విఘ్నాలు చుట్టుకుంటే లొంగిపోకుండా, ప్రతిఘటనలు ముట్టడిస్తే జంకి పోకుండా, మెప్పులకూ గొప్పలకూ కొంగు చాపకుండా, అరికి సంబంధమైన దృష్టి లేనేలేకుండా, ఆంధ్రజాతికి ఉజ్జ్వలమైన పునాది వుందని విస్పష్టంచేసి చూపించడం రూపంగా తమ విధిని చక్కగా నిర్వహించుకున్న శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులుగారికి, యావదాంధ్రులపక్షంగా జయంత్యుత్సవం చెయ్యడానికీ, తదంగంగా వారిపేరజయంతిసంపుటం ప్రకటించడానికీ, పర్సుతోటీనుశ్శాలువులు మొదలయినకానుకలతోటీ వారిని సత్కరించడానికీ మేము పూనుకున్నాము.

నిజానికిది యిదివరకే జరిగివుండవలసింది; అయితే: ఆలస్యం అయినా చెడిపోయిందేమీలేదు. పైగా యిది యిప్పటిదాకా నిలిచి పోయివుండడంలో వొక విశేషంకూడా యేర్పడింది. అదేమిటంటే!

ఆంధ్రత్వాన్ని గ్రహణపరుచుకోవాలనే ఆవేదన మనలో మళ్లీ యిప్పుడిప్పుడే పొటమరిస్తోంది. నాలుగుమూలలా చెదిరిపోయివున్న యితర్ల అభ్యుదయానికి పెట్టుబడిగా వినియోగపడుతూవున్న మన శక్తియుక్తులు మళ్లీ యిప్పుడు అంతర్ముఖాలవుతున్నాయి. ఆంధ్రుల చరిత్రలో యిది వొక గొప్పఘట్టం. దీనికి శ్రీ వీరభద్రరాయజయంతి అనురాగ్వణగా—దీక్షాస్వీకారంగా— కంకణధారణంగా—సార్థకంగా యేర్పడుతుంది.

మనలో శ్రీ వీరభద్రరావుపంతులుగారిని యెరిగినివారూ, వారి అపారపరిశ్రమఫలితం అనుభవించనివారూ ఆంధ్రులలో లేరు. కనుక వారికి సత్కారం చెయ్యవలసివుంది అన్నామంటే మా మాత్రమే తప్ప సత్కారం చెయ్యగలవన్నారని మేమెవరికీ చెప్ప వలసిన పనిలేదు.

చరిత్రచతురాననులైన శ్రీ వీరభద్రరావుపంతులుగారిపేర ప్రకటించబడే యీసంపుటంలో, మనదేశచరిత్రలోనూ, మనభాషావాఙ్మయాలచరిత్రలలోనూ యేర్పడిన వ్యాసఘట్టాలను సమన్వయపరిచే వరిశోధక వ్యాసాలే (గద్యలోను యిష్టాన్ని అనుసరించి వ్యావహారికంలోనూ గ్రాంథికంలోనూ కూడా) వుంటాయి. పండితులకూ, చరిత్రనిర్మాతలకూ యిది వొక ఆధారంగా వుండేటంత చక్కగా ప్రకటించాలని మేము నిరపరుచుకున్నాము. ఇది మూడువందల పేజీలకు తక్కువ వుండకూడదనికూడా మేము నిశ్చయపరుచుకున్నాము.

ఈసంపుటం సర్వాంగసుందరంగా తయారుకావడానికీ, సత్కారంకూడా గొప్పగాజరగడానికీ అవసరముయ్యే ధనము ఆంధ్రసోదరీసోదరులు అత్యుత్సాహంతో అతిశీఘ్రంగానే సమకూరుస్తారని మేము నమ్ముకుని వున్నాము.

ఈ మహోత్సవం, రాజమహేంద్రనగరంలో, వైశాఖమాసంలో జరగించాలని మావూహ.

ఈమహోత్సవ నిర్వహణానికి, దేశీయులు ఈక్రింది తరగతులలో ధనసహాయం చేస్తారని మేము కోరుచూస్తున్నాము.

ప్రధానపోషకులు	...	౧౧౬-౦-౦
రాజపోషకులు	...	౫౧-౦-౦
పోషకులు	...	౨౫-౦-౦
అభిమానులు	...	౧౧-౦-౦
గ్రాహకులు	...	౫-౦-౦

ఈ తరగతులలో చేరినవారిని సన్మానకర్తలుగా ప్రకటిస్తూ వారికి సంపుటం అందచేస్తాము.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి,
ప్రబుద్ధాంధ్ర సంపాదకుడు కార్యకర్త,
భూపతిరాజు వేంకటకృష్ణారావు
బి. ఏ., బి. ఎల్., వకీలు, సంపాదకుడు
ఇన్నీసుపేట, రాజమండ్రి

* * * * * *

త్రిలింగపత్రిక ఈప్రయత్నానికి తన ఆమోదం యిలా ప్రకటిస్తోంది.

"ఈ శీర్షికతో నీసంచికలో సంపాదకులు ప్రకటించినదైయున్న ప్రకటనమును మా పాఠకులు చూచియే యుందురు. శ్రీ వీరభద్రరావు పంతులుగారి కీర్తిసమ్మాన మిదివరకెప్పుడో జరిగియుండవలసినది. ఇప్పుడయినను మించిపోలేదు. ఈకార్యము నిర్వహించుటకు పూనుకొన్న శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారిని, శ్రీ భూపతిరాజు వేంకటకృష్ణారావుగారిని మేము ప్రశంసించుచున్నాము. పత్రికా సంపాదకులుగను సకల రచయితలుగను చరిత్రకర్తలుగను శ్రీ వీరభద్రరావుపంతులుగారు నాలుగుఖ్యాతి పొందియున్నారు. వారిజీవితము నాంధ్రవాఙ్మయసేవకే ముఖ్యముగ అర్పించినవారు ఆంధ్రులయందరి మన్ననకు పాత్రులైనవారు. ఆరుదైన విద్యావిషయములను ప్రమాణసహితముగను కొంత గ్రంథములను గాని వారు నిర్మించినవారు లేరు. ఆంగ్లేయుల గ్రంథములలో అంధ్రప్రముఖులు శ్రీ పంతులుగారిచేత ఆయాంధ్రుల చరిత్రను సంస్కరింపజేసి ప్రకటింపజేసినచో గొంతకొంత దీర్ఘకాలపు లోపముగానిది ప్రకటింపబడి కొంత వృద్ధి చేసినగాని ఆదియిప్పుడే జల్లారిపోయినది. అయితే యింతకాలమునకు శ్రీ వీరభద్రరావుగారి తత్సంస్కారమునకు పూనుకొని ఆయనపేర సంపుటము ప్రత్యేకముగ ప్రకటింపవలెనని యత్నము చేయుచున్నారు. ఆంధ్రసోదరులందరును ఆసంపుటమును స్వీకరించి పంతులుగారిని ప్రోత్సహించుటయేకాక వారిని గొప్పగా సమ్మానింపవలెనని శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి భూపతిరాజు వేంకటకృష్ణారావుగార్లను సహృదయులైన హస్తములతో ధనసాహాయ్యముచేసి ఈసమ్మానము సక్రమముగను వైభవముగను జరుగునట్లు తోడ్పడగోరుచున్నాము. ఇట్టి సమ్మానమునకు శ్రీ వీరభద్రరావుపంతులుగారు పూర్తిగా తగినవారు. ఈవిషయమున యెవరికిని భిన్నాభిప్రాయములుండవని నమ్ముచు మేమును హృదయపూర్వకముగా మా ఆమోదమును ప్రకటించుచున్నాము."

వ్యాఖ్యానములు

కొత్త సంవత్సరం

ఈ సంచికతో ప్రబుద్ధాంధ్రపత్రికకు కొత్త సంవత్సరం ప్రారంభం అయింది.

మళ్లీ ప్రారంభించాక, యీ పత్రిక, యిప్పటికి నిర్విఘ్నంగానూ నిరాఘాటంగానూ రెండేళ్లు ప్రవర్తించింది.

ప్రబుద్ధాంధ్ర ఆవశ్యకాన్ని జాతి పూర్తిగా గుర్తించింది.

ఆంధ్రత్వాన్ని స్పర్ధపడుచుకోవాలనే ఆవేశం మనలో మళ్లీ యిప్పుడిప్పుడే పొటమరిస్తోంది. నలుమొగాలా చెదరిపోయి వున్న — ఇతర్ల అభ్యుదయానికి వినియోగపడుతూ వున్న మన శక్తియుక్తులన్నీ మళ్లీ అంతర్ముఖాలవుతున్నాయి.

మనకు ఆంధ్రత్వం యింకా భారతీయత్వం తోవాంతానూ. మనలో ఆంధ్రజాతీయత సమృద్ధిగా ఏర్పడినప్పుడే భారతజాతీయత స్ఫుటంగా ఆకారం అవుతుంది.

ఆంధ్రత్వం లెక్కచేసి ఉంటే మనకు భారతీయత్వం సంక్రమించనే సంక్రమించదు.

అసలు, భిన్నప్రాంతాల జాతులన్నీ వొకచోట కూడినప్పుడే భారతీయత మూర్తిమంతం అవుతుంది. అంతేగాని భారతీయత స్వయంభువు కానే కాదు.

ప్రబుద్ధాంధ్ర విశ్వాసం యిది. దీనికి ప్రాతికూల్యం వస్తే ప్రబుద్ధాంధ్ర ప్రతిఘటిస్తుంది. దీనికి పోటీ రానంతసేపూ భారతజాతీయత విషయంలో ప్రబుద్ధాంధ్రకేమీ పేచీ లేదు.

మనం వొక పూలదండో గుచ్ఛమో అంటే, సమంగా వికసించిన పూవులనే సమకూర్చుకుంటాము. గుడ్డిపువ్వులను విసరిపారేస్తాము. అలాగే భారతజాతీయత సర్వాంగసుందరంగా వుండాలంటే ప్రాంతీయజాతులు సమంగా వికసించినప్పుడే అది సాధ్యపడుతుంది.

ఇప్పుడు భారతజాతీయతలో ఆంధ్రజాతికి స్థలం లేదు. కారణం, యెక్కువగా, ఆంధ్రుని అలసభావం. తక్కువభాగం ఇతర్ల స్వార్థపరత్వం.

అలసభావం అంటే ఆత్మప్రత్యయం లేకపోవడమే. అది లేనందుకు యిప్పటి ఆంధ్రునకు విచారం లేదు. పైగా అది అక్కరలేదనీ, అది అపాయకరమనీ నిశ్చయం కూడానూ.

ఇందుచేతే ఆత్మాభిమానం గిడ్డకట్టిన యితర్ల అంకెరయొకటూ ఆంధ్రుడు అనుచరుడుగా — భృత్యుడుగా వంగివంగి సలాములు చేస్తూ పక్కపక్కగా ఓసరిల్లి తిరుగుతున్నాడు.

ఇది మనకు సిగ్గులచేటు.

మనజాతి నేటిది కాదు.

మనజాతికి దృఢమైన పునాది వుంది. గొప్ప పూర్వచరిత్ర వుంది. మహోన్నతమైన నాగరికత వుంది.

ప్రపంచంలో ఆంధ్రజాతి లేకపోయివుంటే భారతజాతికి ఇంత ఔజ్జ్వల్యమే లేకపోయివుండును.

ఇప్పుడు కూడా భారతజాతీయతకు ఆంధ్రజాతీయత అంత ప్రధానం కావాలి.

ప్రబుద్ధాంధ్ర ప్రాప్యం యిదీ.

ఇందుకోసమే, ప్రబుద్ధాంధ్ర, హిందీ దురాక్రమణాన్ని ప్రతిఘటిస్తోంది. ఇందుకోసమే, ప్రబుద్ధాంధ్ర, కాంగ్రెస్సుకంటే మనకు ఆంధ్రమహాసభ చాలా ముఖ్యం అంటోంది.

దేశీయులు ఈ రెండేళ్లూ ప్రబుద్ధాంధ్రను పోషించారు; కాని ఆపోషణ చాలలేదు. చేసిసొమ్ము చాలా పడింది. ఆయాసం వచ్చింది. సరస్వతీపవనముద్రాక్షరశాల అధిపతులు శ్రీఅద్దేపల్లి లక్ష్మణస్వామినాయుడుగారూ, కార్మికశాల వర్తకులు మెస్సర్సు మాదేటి సత్యాసయ్య అండు సన్సువారూ అభిమానించుకోకపోతే ప్రబుద్ధాంధ్ర యింత సక్రమంగా ప్రకటింపబడక పోయివుండును.

ఇంతవరకూ ధనమూ రచనలూ చిత్రాలూ యిచ్చి మాకు సాయం చేసినవారికి చాలాచాలా నమస్కారాలు. ఈ కొత్త సంవత్సరం ప్రారంభం కాగానే వారిలో కొందరు మళ్లీ చేయూత యిచ్చారు. అజాబితా వేరొకచోట ప్రకటించబడివుంది.

తక్కినవారు కూడా తమ చేయూత మళ్లీ అందిస్తారనీ, కొత్తవారు కూడా మరికొందరు ప్రబుద్ధాంధ్ర పోషణకు పూనుకుంటారనీ లక్ష్మణస్వామినాయుడుగారూ, మాదేటి సత్యాసయ్య అండు సన్సువారూ, యథాపూర్వంగానే మళ్లీ ఆదుకుంటారనీ ఆశిస్తున్నాము.

వావిళ్లవారు అరవలా ?

ప్రజామిత్రపత్రికలో (౨౯-౧౨-౩౫) శ్రీనివాసశిరోమణిగారిలా రాశారు.

"అసలు ఇదంతా ఎందుకు, రెండుకోట్ల డెబ్బైలక్షల ఆంధ్రులకు పుస్తకాలు ప్రకటించడానికి ఒక్క తెనుగువాడి దుకాణం లేదు. ఈవిషయం ఏతెనుగువాడయినా ఎప్పుడయినా గమనించాడా ? ఇంత తెలుగుదేశానికీ, ఇంతమంది తెలుగువాళ్లకూ పుస్తకప్రకాశకులు వావిళ్ళ రామశాస్త్రులూ అండు సన్సు. ఆ ఒక్కరూ తెనుగువారు కారు, అచ్చమయిన తమిళులు అని "భారతి" పత్రిక ౧౯౩౩ వ సంవత్సరం డిసెంబరు సంచికలో సంపాదకుడు వ్రాశాడు"

భారతి సంపాదకులు ఇలా రాశారు.

"విలుప్తము కానున్న ఆంధ్రుల వాఙ్మయసంపదను ఇట్లు కాపాడుచున్న వావిళ్ళవారు ఆంధ్రులు కారు; ద్రావిడులు. వారు మాట

డునది అరవము. వారు వ్యవహారమునకు మాత్ర మాంధ్రము నుపయోగింతురు. వారు ఆంధ్రుల వాఙ్మయమునకు చిరంజీవితను కల్పించిన మహోదారులు. ఆంధ్రుల నంటబెట్టుకొనియున్న పరాశ్రయదోషమునకు ఇదియు నొక గొప్ప నిదర్శనము"

వావిళ్ళవారూ, నేలటూరివారూ, వేదంవారూ, చదలవాడవారూ, దండిగుంటవారూ, పురాణంవారూ (ఈయింటిపేరు కెల్నాటవారిలో కూడా వుంది) అల్లాడివారూ మామిడివారూ—ఈమొదలయినవారు పుదూరుద్రావిడులు.

పుదూరుద్రావిడుల సంఖ్య వేలమీద మాత్రమే వుంది.

అంత చిన్ని తెగవారిని ఆంధ్రు లని చెప్పకపోతే ఆంధ్రజాతికి వచ్చిన నష్ట మేమీ లేదు.

కాని వారందరూ ఆంధ్రులు. ఏమీ సందేహం లేదు.

వారు ఆంధ్రుల మని చెప్పుకుంటున్నారు. ఆంధ్రుల మని గర్విస్తున్నారు.

పైగా, అరవలు పుదూరువారిని ఆంధ్రులుగానే పరిగణిస్తున్నారు.

నెల్లూరు మొదలు మద్రాసువరకూ దక్షిణపట్నాలలో ఆంధ్రభాషకు పట్టుగొమ్మలై నిలిచినవారిలో అధిక సంఖ్యాకులు పుదూరువారు.

తెనుగులో మొదట వచనరచన ప్రారంభించినవారు చదలవాడ సీతారామశాస్త్రిగారు. మాక్మిలన్ కంపెనీవారు ప్రకటిస్తూ వున్న మాన్సడన్ దొరగారి వాచకాలను తెనుగులోకి మార్చినవారున్నూ సీతారామశాస్త్రిగారే. వీరేశలింగంపంతులుగారు తమ పేరు మాత్రమే యిచ్చారు; గాని తెనిగించలేదు. శబ్దరత్నాకరం తయారు చేసినవారు చదలవాడ సీతారామశాస్త్రిగారే గాని బహుజనపల్లి సీతారామాచార్యులుగారు కారు. ఆచార్యులుగారు శాస్త్రిగారికి అసిస్టెంటుగా వుండేవారు. శాస్త్రిగారు, పని చేసినంతసేపూ చేసి ఇంటికి వెళ్లిపోయేటప్పుడు శబ్దరత్నాకరమును ఆఫీసులోనే పెట్టెలో వుంచేవారు. అది పూర్తి అయిన కొద్దిరోజులకు, వారు, హఠాత్తుగా కాలంచేశారు.

సీతారామాచార్యులుగారు ప్రూఫులు చాలా చక్కగా దిద్దేవారు. వారు తాతవిల్లి ముతాదారు శేషగిరి శాస్త్రులవారికి ప్రూఫురీడరుగా వుండేవారు.

చదలవాడ సీతారామశాస్త్రిగారి జీవితం అంతా ఆంధ్రభాషాసేవలోనే గడిచింది. అరవంలో వా రేమీ పని చెయ్యలేదు. చదలవాడ సుందరరామశాస్త్రిగారూ, దండిగుంట సూర్యనారాయణశాస్త్రిగారూ, పురాణం హయగ్రీవశాస్త్రిగారూ మొదలయినవారు కూడా తమ జీవితాలను ఆంధ్రభాషాసేవలోనే వినియోగించారు: గాని అరవంలో కించిత్తయినా పని చెయ్యలేదు.

వేదం వేంకటరాయశాస్త్రిగారి వైదుష్యం అంతా ఆంధ్రభాషకే వినియోగపడింది. వావిళ్ల రామస్వామిశాస్త్రులవారి శక్తియుక్తులన్నీ ఆంధ్రవాఙ్మయచిరంజీవితకే వినియోగపడ్డాయి. వారు కూడా అరవంకేసి చూడనే లేదు.

అరవబ్రాహ్మల అనేకమంది తెనుగుదేశంలో స్థిరపడ్డారు. వారిలో మొదట వచ్చినవారు కోనసీమద్రావిడులూ ఆరామద్రావిడులూను. వీరిద్దరూ అరవం పూర్తిగా మరిచిపోయారు. శుద్ధాంధ్రులుగానే వ్యవహరించుకుంటున్నారు. అయితే: ఆరామద్రావిడులు తెనుగు ఆచారాలూ, సంప్రదాయాలూ పూర్తిగా అవలంబించి వున్నారు; గాని కోనసీమద్రావిడులు కర్మకలాపంవిషయంలో ద్రావిడసంప్రదాయమే అవలంబిస్తున్నారు.

తరవాత తెనుగుదేశానికి వచ్చిన అరవబ్రాహ్మలే తుమ్మగుంటద్రావిడులు. వీరుకూడా అరవం పూర్తిగా మరచిపోయారు. భారతి సంపాదకులు ఈతెగకు చెందినవారే. వీరిని కూడా సర్కారుల ఆంధ్రయుకులు చాలామంది అరవవారనే చెబుతూవుంటారు.

పుదూరుద్రావిళ్లని వ్యవహరించబడుతూ వస్తున్నవారు యిటీవల తెనుగుదేశానికి వచ్చిన అరవబ్రాహ్మలు. వారు వచ్చి యెంతో కాలం కాకపోయినప్పటికీ, అరవదేశంతో అనుబంధమున్న నెల్లూరు జిల్లాలో స్థిరపడి వుండిపోయినవారిలో ఇంటిలో అరవం మాట్లాడు కోవడం ఒకటి తక్కువయింది. మద్రాసు సంబంధం లేకుండా నెల్లూరు జిల్లాలోనే వుంటూవున్న పుదూరుద్రావిడులు నెల్లూరుజిల్లా ఆంధ్రులలాగే శుద్ధాంధ్రులుగా వున్నారు. వారిలో చాలామంది అరవం మరిచిపోయారు.

వేదం వేంకటరాయశాస్త్రిగారికి తెలుగు, అరవం, సంస్కృతం, ఇంగ్లీషుభాషలలో సమానమైన పాండిత్యం వుంది. అయినా వారు పరిశ్రమ అంతా తెనుగులోనే చేశారు. తమ శక్తి అంతా తెనుగు భాషకే ధారపోశారు. అరవం అంటే వారికి చాలా చిరాకుగా వుండేది.

వావిళ్లవారు పుస్తకవ్యాపారం చేస్తున్నారు. రామస్వామిశాస్త్రిగారు తెనుగుభాషకు చాలా సేవ చేశారు. వారు గొప్ప ఆంధ్రపండితులు. అనేకాంధ్ర గ్రంథాలకు టీకలు రాశారు. ఆంధ్రగ్రంథ ప్రకటన మొదట ప్రారంభించినవారే. తెనుగులిపికి ఇంగ్లీషుబాడీ, అని పిలవబడే చిన్న అక్షరాలను (ఈవ్యాసం కూర్చబడ్డఅక్షరాలను) తయారు చేయించినవారు రామస్వామిశాస్త్రులవారే. నేటికీ వారి సంస్థ తెనుగుసంస్థలలో అద్వితీయంగా వుంది. అరవానికీ, తెనుగుకీ కూడా యిప్పటికీ మద్రాసే వర్తకస్థానంగా వుంది. ఇలాంటి సందర్భంలో వావిళ్లవారు తెనుగువాఙ్మయ ప్రకటనకు మాత్రమే యెందుకు పూనుకోవలసి వచ్చిందీ? తెనుగు పుస్తకాలతో పాటు, వారు, అరవ పుస్తకాలు కూడా ఎందుకు ప్రకటించడం లేదు!

పోనీ, అరవులు రెండుకోట్ల డెబ్బైలక్షలున్నారు కదా, వారిలో వొక్కరైనా ఆంధ్రగ్రంథప్రకటన కెందుకు పూనుకున్నారు కారూ? ప్రారంభం చేసి కొంతవరకూ సాగించిన వేమూరివారు ఎందుకు చాలించుకున్నారూ?

వావిళ్లవారు 'త్రిలింగ' అనే పేరితో ఆంధ్రములోనూ, 'ఫెడరేటెడ్ ఇండియా' అనే పేరితో ఇంగ్లీషులోనూ మాత్రమే వార పత్రికలు నడుపుతున్నారు. ఆరవపత్రికలకు ప్రచారం అధికంగా వుండడమూ, లాభం కూడా వస్తూవుండడమూ తెలిసివుండిన్నీ వారు, అరవంలో కూడా పత్రిక ప్రకటించకపోడానికి కారణం యేమిటి?

కొంచెం జాగ్రత్తగా యోచిస్తే పుదూరుద్రావిడులు అరవ లనడం చాలా సాహసం అని తెలుస్తుంది.

నిజానికి వస్తే, తెనుగుదేశంలో వున్న కౌసలనాటి బ్రాహ్మలు అసలు తెనుగువారు కారు. కోసలదేశంనుంచి వచ్చినవారు. వెల్నాటి వారు కూడా విదర్భదేశంనుంచి వచ్చిన మహారాష్ట్రులు కాని అసలు తెనుగుబ్రాహ్మలు కారు. వెల్నాటిశాఖలో నుంచే విడిపోయిన ఆరువేలనియోగిశాఖకు చెందిన శ్రీనివాసశిరోమణిగారు కూడా శుద్ధాంధ్రులు కారు.

పుదూరువారు, తాము ఆంధ్రులమే అని చెప్పుకుంటూ వున్న ప్పుడూ, అరవలు వారిని ఆంధ్రులుగానే పరిగణిస్తూ వున్నప్పుడూ, పుదూరుద్రావిడుల శక్తియుక్తు లన్నీ ఆంధ్రభాషా వాఙ్మయాలకే వినియోగపడుతూ వున్నప్పుడూ వారు అరవ లని, ఆంధ్రులు కారనీ కేటాయింపు రాతలు రాయడం చాలా అనుచిత మైన పని.

దీనివల్ల స్థిరపడిపోయిన పుదూరుద్రావిడుల ఆంధ్రత్వాని కేమీ చలనం లేదు; గాని ఆంధ్రయువకులలో కొందరి విపరీతపరిస్థితులే వెల్లడిలోకి వస్తాయి. అంతే.

గత ఆంధ్రనాటక కళాపరిషత్సమావేశం

దీన్ని బెజవాడ వారు పిలిచారు. మదరాసువారు నిర్వహించారు.

తెనుగుదేశంలో క్రమం తప్పకుండా సరిగా సంవత్సరానికి జరిగిన సమావేశం యిప్పటిమట్టుకి దీ వొక్కటే కనపడుతోంది.

కాని యేమి లాభమూ?

పరిషత్తు అయిదేళ్ళనుంచి పని చేస్తోంది. పత్రికాప్రకటన కూడా ప్రారంభించింది; కాని నటులను దిద్దలేకపోయింది. తయారీ చెయ్యలేకపోయింది. రంగస్థలాలను సంస్కరించలేకపోయింది. ప్రజను నూత్నరుచి నుప్పలేకపోయింది. టాకీలవిషయం అసలు తలపెట్టనే లేకపోయింది.

నాటకరచనకు మాత్రం కవులకు ప్రోత్సాహం కలిగించింది; గాని ఆసందర్భంలో పరిషత్తు తొక్కిన మార్గం కుమార్గం అయి పోతుంది. తప్పుకు.

ప్రకృతం.

ఈ సమావేశాన్ని ప్రారంభించినవారివల్ల గాని, అహ్వానసంఘాధ్యక్షులవల్ల గాని, అధ్యక్షులవల్ల గాని పరిషత్తున కేమీ విశిష్టత యేర్పడలేదు. ప్రతినిధుల సంగతి కూడా అలాగే వుంది. ఇక ప్రదర్శించిన నాటకాలా? అవి యేనాడో మూలబడిపోయినవి. మళ్లీ పైకి తియ్యరానివి. వాటిలో రసం లేదు. కళ లేదు.

నటులు ఏది ప్రదర్శిస్తామంటే దానికే అవకాశం కలిగించడం పరిషత్తుకు గౌరవం కలిగించదు.

పైగా ఈ ఆంధ్రనాటకకళాపరిషత్తు హిందీనాటకాలను ప్రదర్శించడం నిజంగా గర్హించతగింది. ఆనటులు అంత గొప్పవారా? హిందీనాటకాలను ప్రదర్శించడంవల్లనే వారు గొప్పవారైనారా? వారు ప్రదర్శించిన నాటకం అనువాదం కాని స్వసంత్రం కాదే? అది తెనుగులో కూడా వుంది కదా, తెనుగు అనువాదాన్నే ఆనటులు—కారు పరిషత్తు ప్రదర్శనం చేయించకూడదూ?

ఆంధ్రనాటకకళాపరిషత్తు హిందీప్రచారానికి వినియోగపడడం ఆత్మహత్య. అధ్యక్షుల వుపన్యాసాన్ని బట్టి ఈ హిందీప్రదర్శనాలకు వారే ప్రోత్సాహకులుగా కనపడుతున్నారు. వారు తమ కాంగ్రెస్సుభక్తిని ఆంధ్రనాటకకళాపరిషత్తులోకి కూడా దిగుమతీ చెయ్యడం తమకూ పరిషత్తుకూ కూడా అప్రశస్తమైన పని.

నిరుడే ప్రదర్శనాల సందర్భంలో పరిషత్తు చాలా నిందపాలయింది. ఈసంవత్సర మేనా నటులను తయారు చేసి వొక మంచి నాటకాన్ని ప్రదర్శిస్తుం దని ఆశించాము; కాని అది అలా జరగకపోడమే కాకుండా యక్షగానాలకు కూడా యీ సంవత్సరం బహిష్కారం చేసింది. భరతనాట్యం మాట తలపెట్టనే లేదు. అకన్యాశుల్క—న్నయినా పీలయినంతవరకూ పూర్తిగా సక్రమంగా ప్రదర్శింపచేస్తే బాగుండిపోవును; కాని దాన్ని వొక నాటకానికి సత్రకాయగా చేసింది. కోతిముక్కుకు దొండపండు కట్టింది.

నాలుగో సమావేశం పామరరంజకంగానేనా వుంది. ఈసంవత్సరం అలాగా లేదు. పెద్దనటు లెవ్వరూ యీసంవత్సరం కనపడ లేదు.

కార్యదర్శి నీలంరాజు వెంకటశేషయ్యగారి పరిశ్రమ మేమెరుగుదుము. ఈసంవత్సరం వారు పడిన యిబ్బందులున్నూ మేమెరుగుదుము; కాని వారు కొంచెం పెద్దయెత్తులు వెయ్యాలి. సాగకపోతే పరిషత్తునే సలిపివెయ్యవచ్చు; గాని యిలా నడపడంవల్ల కష్టమూ, నష్టమూనే గాని సుఖమూ లాభమూ కలగవు.

పరిషత్తు ఇంతకంటే చక్కగా జరగడాని కవకాశాలు లేవని మేము నిరుత్సాహపడము. పూనుకుంటే యింతకంటే యెన్నో రెట్లు బాగుచెయ్యవచ్చు. అయితే మొగమాటాలూ, దాక్షిణ్యాలూ మట్టుకు దూరంగా వుంచాలి. గుణమే ప్రధానంగా యెంచుకోవాలి.

పరిషత్తు తుక్కునాటకాల కవకాశం యిచ్చినంతకాలమూ దేశీయులు కళనే ప్రధానంగా చూడరు. పరిషత్తుకు ఫాయిదా కూడా యేర్పడదు.

ఆంధ్రసాహిత్య పరిషత్తులాగే యీ ఆంధ్రనాటక కళాపరిషత్తు కూడా అపమార్గంలోనే వుండడం చాలా విచారకరంగా వుంది.

నాల్గవ నిజాంరాష్ట్రాంధ్ర మహాసభ

హైదరాబాదు సంస్థానం హిందూదేశంలో వున్న స్వదేశసంస్థానాలన్నిటిలోనూ పెద్దదీ, మొదటితరగతిలో దీనీ. దాని వైశాల్యం యెనభైరెండువేల చదరపు మైళ్లలో తెనుగు దేశం సగానికి పైగా వుంది. దాని జనసంఖ్య వొక కోటీ నలభైలక్షలలో మనవారు డెబ్భయిలక్షలకు మించివున్నారు. ఆరాజ్యంలోని తెనుగుభాగానికి "తెలంగానా" అని వ్యవహారం.

నిజాము ప్రభుత్వానికి ప్రతి సంవత్సరమూ వసూలవుతూ వున్న మాల్గుజారీలో చాలా భాగం తెనుగునాగే చెల్లిస్తున్నారు. రాష్ట్రం అంతటా వున్న తరీభూములలో నూటికి ౭౫ వంతులు తెలంగానాలోనే వున్నాయి. ఎక్కువ ఆదాయం ఇచ్చే గొప్పగొప్ప అడవులన్నీ తెలంగానాలోనే వున్నాయి. ఆరాష్ట్రంలో వున్న పెద్దపెద్ద చెరువులూ, సుప్రసిద్ధమైన దుర్గాలూ చాలామట్టుకు తెలంగానాలోనే వున్నాయి. కాకతీయ సామ్రాజ్యవైభవాన్ని కొనియాడుతుండిన వరంగల్లు కోటలూ, పట్టణాలూ, అనపోతనాయని రాజధాని రాచకొండపట్టణమూ, అద్వితీయ పురాతన శిల్పసంపద గల హనుమకొండ దేవాలయమూ, వెయ్యిస్తంభాల మంటపమూ — ఇంకా యింకెన్నో తెలంగానాలోనే వున్నాయి.

ఆరాష్ట్రపు రాజధానిగా వున్న హైదరాబాదు కూడా తెలంగానాలోనే వుంది.

ఒకప్పుడు ఆఆంధ్రభూభాగం సర్వభయంకరం గాగానూ, భూలోక స్వర్గంగానూ, ఆంధ్రుల ప్రతిభా ప్రతాపాలకు ప్రశస్తశాలగానూ వుండింది.

ఇప్పుడు ఆరాష్ట్రంలో వున్న డెబ్బయిలక్షల ఆంధ్రులూ కాకతీయసామ్రాజ్యనిర్వాహకులైన ప్రభువుల, పండితుల, కవుల, వీరుల, శూరుల, యోధుల, శిల్పివుంగవుల సంతతివారు.

ఇంతమాత్రమేనా!

వారందరూ మన మాంసంలో మాంసం, మన రక్తంలో రక్తం, మన జీవంలో జీవం.

కాని వారికీ మనకూ ప్రభుత్వాలు వేరయినాయి. వారికీ మనకూ వ్యవహారసంబంధాలు లేకుండాపోయాయి. కాని అవి సమగ్రాంధ్రజాతీయతను భంగకరాలు కాలేవు.

లౌకికాలయిన హద్దులెన్ని యేర్పడినా చిరసంచితమైన విజ్ఞానం—ప్రకృతి కనుకూపమైన నాగరికత—ధారావాహికమైన సంప్రదాయం—వీటిని భిన్నం చెయ్యలేవు.

మహాఘనత వహించిన నిజాముప్రభువు అద్భుతప్రతిభాశాలి. హిందూదేశం అంతా ఆయన చూశారు. సాటి మైసూరు—బరోడా సంస్థానాలు లక్ష్మీవిహారవనాలుగా తయారయిపోయి వుండడం కనిపెట్టారు. "అన్నిటిలోనూ పెద్దసంస్థానం, మనది వెనకబడిపోవడమా" అని అభిమానం తెచ్చుకున్నారు. ఇప్పుడు చూస్తే హైదరాబాదురాజ్యం క్షణక్షణమూ నూత్నవికాసం పొందుతోంది. ఒక్క పదేళ్లలో మైసూరు, బరోడా రాజ్యాలు హైదరాబాదు ఎదుట మినుకూమినుకూ మంటూ వుంటాయి.

ఆరాష్ట్రపు నాల్గవ ఆంధ్రమహాసభ మొన్ననే—అంటే డిసెంబరు చివరరోజులలో సిరిసిల్ల అనే గ్రామంలో జరిగింది. ఆరాష్ట్రంలో వున్న ఆంధ్రప్రముఖులంతా అక్కడ అవతరించారు. ఆంధ్రత్వం కోసమూ, పునరున్నతికోసమూ ఆవేదనతోటీ, ఆవేశముతోటీ పొంగిపోతూ వున్న మాన్యులు శ్రీమాన్ పాటి హనుమంతరావుపంతులుగారు అధ్యక్షత వహించారు. అధ్యక్షోపన్యాసం, పంతులుగారి కులంకషపాండిత్యానికీ, ఆపారావేశనకూ దర్పణంగా వుంది. ఉపయోగకరాలైన తీర్మానాలు చెయ్యబడ్డాయి.

నిజాంరాష్ట్రపు ఆంధ్రమహాసభలు కూడా అక్కడి సమావిష్టులై ఆంధ్రజాతీయతను ఉద్ధరించడానికి తగిన కార్యక్రమం ఏర్పరుచుకున్నారు.

పరిశీలించి చూస్తే మూడో సభ తీర్మానాలు కొన్ని చాలా ముందుకు తెచ్చివుంచినట్లు బోధపడుతుంది.

"మనలో విద్య యెక్కువ వుం"దనీ, "అనేకకార్యాలు మన కెక్కువ వున్నా" యనీ సర్కారాంధ్రులకు చాలా అహంభావమే వుంది: కాని యీవిద్యం ప్రయోజనరహితమయిపోతుంది. నిజాంరాష్ట్రాంధ్రులు మేలుకొన్నారు. వారి శక్తిసామర్థ్యాలను వినియోగించుకోవడానికి అక్కడ వ్యక్తిరాజకీయాలు లేవు. ఉన్నదంతా, వారు, భాషకోసం, వాఙ్మయంకోసం, నాగరికతకోసం, విజ్ఞానంకోసం, పరిశ్రమలకోసం, వాణిజ్యంకోసం—ఈకాలంలో ఉన్నతి కలిగించే సకల విషయాలకోసమూ వినియోగించుకుంటారు. త్వరలోనే మనకంటె పదేళ్లలో, వారు, మనకు ఆదర్శం అవుతారు.

చాలా సంతోషం.

నిజాంరాష్ట్రాంధ్రులకు మా ప్రశంసలు విన్నవిస్తున్నాము.

మళ్లీ శ్రీనివాసఅయ్యంగారా?

శ్రీమాన్. ఎస్. శ్రీనివాసఅయ్యంగారు, ఒకప్పుడు, గత మని కాంగ్రెస్సులో ప్రవేశించారు. అతి మరితంగా విరామం లేక, కృష్ణాష్టమి సం: రంలో, గొల్లభాయిను, వొక్క సంవత్సరంలోనే వుట్టికొట్టేటట్టు కాంగ్రెస్సు సింహాసనం ఆక్రమించారు.

అప్పుడు, అక్కడ—అస్సాము పరిగణాప్రకృతిలోనూ, ఇక్కడ, మద్రాసు రాజకీయాలలోనూ గొప్ప తుపాను చెలరేగింది.

తీరా, అది చల్లబడ్డ తరవాత—అయ్యంగారేరీ?

పరకాయించి చూసేగా, అయ్యంగారు, హైకోర్టు వకీల్సుఛేంబరులో సుఖాసీనులై వున్నారు.

నిన్నటిదాకా వారి స్థితి అలాగే వుండింది.

కాని, యిప్పుడు వారు మళ్లీ కాంగ్రెస్సులో ప్రవేశిస్తున్నారు.

వారు కోరి సొంతంగా ప్రవేశించేటట్టయితే మేము అర్థం చేసుకోగలము; కాని రాజాజీ వగైరాలు, వారిని, బలిమాలి మళ్లీ కాంగ్రెస్సులో ప్రవేశపెడుతున్నారు.

ఎందుకూ—?

మా ప్రశ్న కొందరి కిప్పుడు వికటంగానే కనపడవచ్చు; కాని తొందరపడవద్దు. కాంగ్రెస్సులో, శ్రీనివాసఅయ్యంగారి పునఃప్రవేశంతో మన ఆంధ్రులకు తల దిమ్మెక్కే దెబ్బ తగులుతుంది.

చూస్తూ వుండండి.

కోలవెన్ను రామకోటీశ్వరరావు పంతులుగారు

తాము, ప్రజామిత్రపత్రికలో ప్రకటించిన వ్యాసాన్ని పురస్కరించుకుని మేము (అక్టోబరుసంచికలో) చేసిన వ్యాఖ్యానం చూసి శ్రీ రామకోటీశ్వరరావుపంతులుగారు చాలా ఖేదపడినట్లు తెలిసింది.

మన ఆంధ్రులలో అసహాయశూరులు లెక్క లేనంత మంది వున్నా వారంటే వారు రామకోటీశ్వరరావుపంతులుగారొక్కరే. త్రివేణిపత్రికను సంపాదించడంలో వారు చూపిస్తూవున్న పాండిత్యమూ, అనుభవిస్తూవున్న కష్టాలూ కూడా అసాధారణాలుగానే వున్నాయి.

ఆంధ్రవికాసమే ప్రధానంగా గల ప్రబుద్ధాంధ్రకు పంతులుగారికంటే పూజ్యులు మరొకరు లేరు.

త్రివేణినిధిని సమకూర్చడానికి చెయ్యబడుతూవున్న ప్రయత్నాలలో, కొనకటి విన్నపంలో వున్న సంతకాలే యిప్పటి విన్నపంలో వున్న వని భ్రమించి మేము ఆవ్యాఖ్యానంలో అలా రాయడం తటస్థించింది.

మా ఆరోపణ భ్రమప్రమాదజనితం కాని ప్రయత్నపూర్వకం గాదు.

శ్రీ రామకోటీశ్వరరావుపంతులుగారికి మాపొరపాటు విన్నవించుకుంటూ క్షమించవలసిం దని కోరుతున్నాము.

హిందీపల్ల తెనుక్కు జరుగుతూవున్న అపకారం

డిసెంబరు ౨౯ వ తేదీని మద్రాసు గోఖలేహాలులో జరిగిన దక్షిణ భారత హిందీ ప్రచార సభవారి పంచమవార్షిక పట్టప్రదానమహోత్సవసభను ఉపక్రమిస్తూ మన నాగేశ్వరరావు పంతులుగారు, "ఇంగ్లీషు విద్యాలయాలందు ఈ దేశములో ప్రభుత్వమువారు విద్యార్థివేతనముల నిచ్చి ప్రోత్సహింపవలసిన ఆవశ్యకత కలిగియున్నది. హిందీ విద్యాభ్యాసమునకట్టి ప్రోత్సాహము అవసరము లేకయే వందల కొలది స్త్రీపురుషులు విద్యనభ్యసించుచున్నారు" అని సెలవిచ్చారు. అంటే హిందీభాష అంటే దక్షిణదేశీయులకు అంతటి ఆదరణ వుందని వారి భావం. అయితే, "విద్యార్థులు నేర్చుకొనవలసినవి మూడుభాషలు గలవు. మొదటిది మాతృభాష. రెండవది హిందీభాష. మూడవది ఆంగ్లభాష" అని సెలవిచ్చారే, పంతులుగారు? మొదటిదే అయిన తమ తెనుగుభాష అభ్యసించడానికి విద్యార్థివేతనాలిచ్చినా తెనుగుయువకులు ముందుకు రారనే సంగతి యేమైనా యోచించారా వారు?

* * * * * *

తరవాత పట్టభద్రులకు హితోపదేశం చేస్తూ హిందూస్తానీ లయిన పండితసుందరలాలుగారు "చదువుటకును వ్రాయుటకును దేవనాగరిలిపి అనేకయితరలిపులకంటె యెక్కువ యుపయోగకరముగ నుండును. కాబట్టి మన ద్రావిడియభాషలు కొన్నిటికి గూడ యీలిపి యుపయోగపడవచ్చును" అని సెలవిచ్చారు. దేవనాగరిలిపికంటే ద్రావిడభాషాలిపు లెంత ఉపయోగకరములో, అందులో తెనుగులిపి యెంత సుందరమైనదో—ముఖ్యముగ మూ రేమైనా తెలుసునా సుందరలాలుగారికి? అయితే: వారనాలోచితంగా యీబీజం యిక్కడ వెదజల్లడం లేదు. హిందీద్వారా వారిదివరకే ద్రావిడిభాషలకు ఎసరుపెట్టివున్నారు. ఇప్పుడు దేవనాగరిలిపిద్వారా ద్రావిడభాషాలిపులకు కూడా ఎసరుపెడితే ద్రావిడభాషలింకా తొరగా చచ్చిపోతాయి కాదూ?

సుందరలాలుగారంతచేతో యీ విషయం కొంచెం తెరమరుగుగా చెప్పారు: కాని స్వామీ సత్యదేవుగారు చాలా స్పష్టంగానే చెప్పారు. డిసెంబరు ౩౦ వ తేదీని తిరువల్లిక్కేణి కల్యాణమంటపంలో జరిగిన దక్షిణభారతహిందీప్రచారకుల ఆరవసమావేశంలో వారిలా చెప్పారు. "దక్షిణదేశములో తమిళ, తెలుగు, మలయాళ, కన్నడభాషలను హిందీలిపి అవలంబించినచో హిందీ సామాన్యభాషగ త్వరగా వ్యాపించగలదు" దక్షిణదేశంలో హిందీ అలుముకుపోవలసినదే. దాని కేది అడ్డువచ్చినా కొట్టిపారవేయ్యవలసినదే. ఇదీ హిందూస్తానీల నిశ్చయం.

దక్షిణదేశీయులకు ఒకప్పుడు ఇంగ్లీషు వ్యామోహం ముదిరిపోయింది. అది యింకా వేళ్లు తన్నుతూనే వుండగా యిప్పుడు ఈ హిందీవ్యామోహం.

దక్షిణదేశంలో భావదాస్యం వదిలి యింకా తగ్గలేదు.

ఉన్న వుట్టిమునక అంతా యిదీ. సంపాదకుడు

సరస్వతీ గ్రంథమండలి

కంభంవారి సత్రమువీధి ❋ రాజమహేంద్రవరము

నవలలు—నవరసభరితములగు నవలలు—ముచ్చటగూర్చు బొమ్మలతో—ముద్దులొలుకు క్యాలికో బయిండుతో—రెండుమాసముల కొక్కొక్కొని నవల. నడుమ నడుమ చిన్నచిన్న అనుబంధగ్రంథములు వెలువడుచుండును. చందాదారులకు ప్రవేశరుసుము రు 0–4–0 చందాదారులు ఒకేసారి రు 7 8-0 ను ముందుగా పంపినచో వరుసగా ఆరుపుస్తకములు అన్ రిజిస్టర్డు పార్శిలుగా పంపుదుము.

ఇంతవరకు వెలువడిన గ్రంథములు

11 ప్రేమసుందరి	1 8 0	25 కుంకుమభరణి	1 8 0	39 అగ్రహారము	1 8 0
12 చోరశిఖామణి	1 8 0	26 జాగిలము	1 8 0	40 ఛిన్నహస్తము (1 వ భాగము)	1 8 0
13 లక్ష్మీప్రసాదము	1 8 0	27 మొగలాయీదర్బారు 2 భా॥	1 8 0	41 ఛిన్నహస్తము (2 వ భాగము)	1 8 0
14 హత్యారహస్యము	1 8 0	28 సరస్వతి	1 8 0	42 కంకణరహస్యము	1 8 0
15 ఫాస్టు (1 వ భాగము)	1 8 0	29 ఆనందాభాయి	1 8 0	43 సంజీవి (1 వ భాగము)	1 8 0
16 ఫాస్టు (2 వ భాగము)	1 8 0	30 హత్యాన్వేషణము	1 8 0	44 సంజీవి (2 వ భాగము)	1 8 0
17 కుముద్వతి	1 8 0	31 మొగలాయీదర్బారు 3 భా॥	1 8 0	45 వ్రజరాణి	1 8 0
18 చిన్నకోడలు	1 8 0	32 గంగ	1 8 0	46 హత్యాభ్రమ	1 8 0
19 రహస్యభేదనము	1 8 0	33 మొగలాయీదర్బారు 4 భా॥	1 8 0	47 కౌశిఖండము	1 8 0
20 సింహగడము	1 8 0	34 కోహినూరు	1 8 0	48 సేవాశ్రమము (1 వ భాగము)	1 8 0
21 మణిహారము	1 8 0	35 అటీన్ మనేలా	1 8 0	49 సేవాశ్రమము (2 వ భాగము)	1 8 0
22 మొగలాయీదర్బారు 1 భా॥	1 8 0	36 అపరిచిత	1 8 0	50 దాసీకన్య	1 8 0
23 ఘటనాచక్రము	1 8 0	37 అంతఃపురము (1 వ భాగము)	1 8 0		
24 రాజసుందరి	1 8 0	38 అంతఃపురము (2 వ భాగము)	1 8 0		

అనుబంధములు

1 మృత్యురంగిణి	0 12 0	9 యమునాబాయి	1 0 0	17 లలిత	1 0 0
2 అభాగిని	0 12 0	10 శ్యామల	1 0 0	18 పెండ్లిదండ	1 0 0
3 పద్మవేషి	0 12 0	11 కాంతంకథలు (చిన్నకథలు)	1 0 0	19 కథావళి	1 0 0
4 విదురుని యుపదేశములు	1 0 0	12 కాలసర్పి	1 0 0	20 నాలుగుకథలు	1 0 0
5 కాంచనమాల	1 0 0	13 భారతకథాసారం	1 0 0	21 స్త్రీప్రబోధిక	1 0 0
6 సీమంతిని	1 0 0	14 కథాకల్పవల్లి (చిన్నకథలు)	1 0 0	22 ఆదర్శము (1 వ భాగము)	0 12 0
7 సుశీల	1 0 0	15 అరక్షణీయ	1 0 0	23 ఉదంకుడు	0 12 0
8 శశిరేఖ	1 0 0	16 మాధవి	1 0 0	24 భేతాళకథలు	0 12 0

నాటకములు

1 మార్కండేయ	0 12 0	5 పాజహాను	1 0 0	9 దంపతులు	1 0 0
2 అహల్యాశాపవిమోచనము	0 12 0	6 నూర్జహాను	1 0 0	10 విజయవిజయం	1 0 0
3 మీవారుపతనము	1 0 0	7 దుర్గాదాసు	1 0 0	11 భక్తకుచేల	1 0 0
4 వరమాల	1 0 0	8 చంద్రగుప్త	1 0 0		

ఈ గ్రంథములు రాజమండ్రిలో [illegible]

సరస్వతీ పాకెట్టు డిక్షనరీ యొక్క ఒక నమూనా పుట:—

LIONESS 435 LITTER

Lioness-*n* ఆడుసింహము

Lip-*n* పెదవి

Liquifiable-*adj* కరుగుటకు (ద్రవరూపముగా చేయుటకు) వీలగు

Liquify-*v t* & *v. i* కరిగించు లేక (కరగుము

Liquid-*n* (ద్రవపదార్థము *adj* (ద్రవరూపమైన (ప్రవహించునట్టి

Liquidate-*v t* (ఋణము లు) నిర్ధారణచేయు, ఋణ మును చెల్లించు అప్పు లన్నింటిని తీర్చుకొని పరిష్కరించు *n*

· Liquidator

Liquidation-*n.* ఋణముల పరిష్కారము

Liquor *n* (ద్రవము కల్లు లేక సారాయి

Lisp-*v i* వచ్చి యుండని మాటలాడు, *n* అవ్యక్తపు మాటలు

List-*n.* జాబితా, బట్టయొక్క అంచు *pl.* యుద్ధ (ప్రదర్శ నము జరుగు ఆవరణము, *v t.* & *v i.* అక్రమముగా పనిలో చేర్చుకొను, కాంక్షించు, విను

Listen-*v. i.* & *v t.* విను, ఆలకించు, (శ్రద్ధాళువగు, లక్ష్య పెట్టు

Listless *adj.* జాగ్రత్తలేని అజాగ్రత్త చేయు

Literal-*adj.* (అక్షరముల కనుగుణమైన, అలంకారము లేని *adv.* Literally [సం. మైన

Literary-*adj.* సాహిత్య

Literate-*n.* సాహిత్యవేత్త చదువు కలవాడు, పండితుడు *adj.* సాహిత్యసంబం

Literature *n* సారస్వత ము, సాహిత్యము

Lithe } *adj* మెత్తని
Lithesome } వంగగల

Lithography-*n* రాతిపై వ్రాసి (వ్రాసిన అచ్చువేయుట విద్య *adj* Lithographic-cal

Litigant-*n.* దావా లోని కక్షిదారుడు, *adj.* వివాద పడెడు

Litigate-*v t* & *v i* వ్యాజ్యమాడు, వివాదపడు

Litigation-*n* న్యాయస్థాన పరముగా జరుగు వివాదము

Litter-*n.* డోలి, పశువులకు పోవు పడక పందియొక్క ఒక యీతపిల్లలు, కల్మషము, చెత్త *v t.* (పంది) ఈను చెత్తతో నింపు

సరస్వతీ ఇంగ్లీషు-తెలుగు పాకెట్టు డిక్షనరీ

పేజీలు—665 పైని

పదములు 17000

సరియైన ఉచ్చారణలు ...

...

ధర (ప్రతి 1కి రు 1-8-0

Saraswathi English-Telugu POCKET DICTIONARY.

సరస్వతీ పవర్ (ప్రెస్, రాజమండ్రి.



అచ్చులో నున్నది!

సరస్వతీ పవర్ (ప్రెస్‌వారి (ప్రచురణము, రాజమండ్రి.

మంచి గ్లేజుకాగితము! సొగసైన క్యాలికోబైండు!! పుస్తకములో వస్తుగుణ(ప్రబోధముగల పేజీలు 1000 పైగా నుండును. వెల (ప్రతి 1కి 5-0-0

ఇది సమస్తద్రవ్యగుణములను అసందిగ్ధముగ తెలియజేయు అపూర్వ(గ్రంథరాజము. ఆంధ్రవైద్యలోకమునకు, వైద్యేతరులకును మిక్కిలి యుపయోగకర మగునటుల (బ్రహ్మశ్రీ ఆయుర్వేదభూషణ భిషగ్వర పండిత వీటూరి వాసుదేవ శాస్త్రి, ఏ. యం. ఏ. సి. గారిచే (వ్రాయబడినది. ఇందు సందిగ్ధద్రవ్యములన్నియు నిర్ధారణచేయబడి (ప్రచురింపబడినవి. నూతనపరిశోధితద్రవ్యములు చేర్చబడినవి. వస్తువునందలి రసవీర్యవిపాక(ప్రభావములను గుణములను విడదీసి విస్త

కుంకుమపూవు :— కాశ్మీరజ - కుంకుమ — Corcus-Salivus. Eng: Saffron.

స్వరూపము — ఇది కాశ్మీర దేశమునందును, హీరా దేశమునందును పుట్టు సుగంధద్రవ్యము. దీని కేసరము లెఱ్ఱగను, కొంచెము తెల్లగను యుండును. రంగు వేయబడిన కృత్రిమ కుంకుమపువ్వు బజారులో గలదు. కుంకుమపువ్వు చేతిలో నలిపిన రంగంటుకొనక యుండినచో నది, అసలైనదని తెలియవలెను. నీటిలో వేసిన నీరు యెఱ్ఱబడక యుండిన నది శ్రేష్ఠమైనది. అసలైన కుంకుమపూవు కొంచెము చమురుగలిగి యుండును.

గుణములు — ఇది కారము, చేదు, రుచులు గలది. వేడిచేయు స్వభావము గలది. విపాకమున కారపు రుచిగ మారును. లఘుగుణము. వాతకఫములు హరించును. దగ్గులు కట్టును. విషదోషములు శమించును. కంఠరోగములు, తలనొప్పులు పోవును. వీర్యవృద్ధియు ధాతుపుష్టియును గలిగించును. ముక్కు, చెవి, కన్ను, నోరు, శిరస్సు మొదలగు నూర్ధ్వజత్రుగత రోగములను శమింపజేయును.

ప్రయోగము — అశ్మరీ-కృచ్ఛ్రములకు :— కుంకుమపూవు ద్రాక్ష రసముతో కలిపి త్రాగిన సర్వ కృచ్ఛ్రములు, అశ్మరులు శమించును. (చి. 26 అ. చరకము.)

మూత్రరోధజ-ఉదావర్తమునకు:—కుంకుమపూవు కషాయమును లోనికి త్రాగిన ఉదావర్తము తగ్గును.

మూత్రాఘాతమునకు :—కుంకుమపూవు మెత్తగా నూరి నీటిలో కలిపి దానిలో తేనెవేసి రాత్రి నిలువయుంచి ప్రాతఃకాలమున త్రాగిన మూత్రకృచ్ఛ్రములు తప్పక శమించును. (59 అ. సుశ్రుతము)

శిరోరోగములకు :—కుంకుమపూవును పంచదారయును గలిపి ఆవునేతితో వేచి నస్యము చేయించి యుపయోగించిన కనుబొమలమధ్యను, కణతలయందును, నేత్రములయందును, చెవులయందును, సూర్యావర్తకమను శూలయు నశించును. (చక్రదత్త)

బొల్లికి :—రేలవేరు నీటిలో నఱగదీసి ఆగంధములో కుంకుమపూవు కలిపి బొల్లికి రాసిన బొల్లులు తగ్గును. ముఖముపై మొటిమలుకూడ తగ్గును.

ప్రసవస్త్రీ మైలరక్తశోధనకు :—రెండు చిన్నములకుంకుమపూవును 6 మిరియములును కలిపి నీళ్లతో నూరి ప్రసవస్త్రీ కిచ్చిన గర్భశోధన మొనరించి మైలరక్తమును వెడలించును. జ్వరమును కూడ రాకుండ కాపాడును.

నేత్రరోగములకు :— ఇంపుబగింజ గంధములో కుంకుమపూవు కలిపి కంటిచుట్టును పట్టువేసిన కంటివ్యాధులు తగ్గును. మరియు నిమ్మపండ్ల రసములో కరక్కాయ అరగదీసి దానిలో కుంకుమపూవు కలిపి కంటిచుట్టు పట్టువేసిన నేత్రరోగములు తగ్గును.